
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఫిబ్రవరి 2024

మాఘమాసం వచ్చేసిందోచ్..
ఇక పెళ్లిళ్లే పెళ్లిళ్లు!



- ఒకటికానున్న వేలాది జంటలు
- మే, జూన్ మాసాల్లో మూఢం

నెల్లూరు (సాంస్కృతికం) : మాఘమాసం ప్రారంభమైంది అంటే శుభకార్యాలకు తెరలేచిందని అర్థం. ఓ వైపు వివాహాలు.. మరోవైపు గృహప్రవేశాలు ఇతర శుభకార్యాలు జోరుగా జరగనున్నాయి. ఈ నెల 18 నుంచి 29వ తేదీ వరకు, మార్చి నెలలో 1, 2, 3, 4, 5, 6, 7, 10, 11, 12 తేదీలు, ఏప్రిల్ 18, 19, 20, 21, 22వ తేదీలలో శుభముహూర్తాలు ఉన్నాయి. ఈ రెండు నెలల్లో సుమారు 290కి పైగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. మే, జూన్ నెలల్లో మూఢం రావడంతో ముహూర్తాలు లేవు. జూలైలో 9, 11, 12, 13, 14, 15వ తేదీల తర్వాత నవంబరు నెల వరకు పెళ్లి ముహూర్తాలు లేవు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏప్రిల్ నెలలోపే వివాహాలు చేసేయాలన్న ఆతృతతో ముహూర్తాలు పెట్టించుకున్నారు. మాఘ మాసం, పాల్గుణ మాసం ముహూర్తాలలోనే అత్యధికంగా జంటలు ఒకటి కాబోతున్నాయి. సరాసరి జిల్లావ్యాప్తంగా మాఘ మాసంలో సుమారు 6వేల జంటలకు పైగా వివాహాలు జరుగుతాయని పురోహితులు తెలిపారు. అలాగే గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు కూడా జోరుగా జరగనున్నాయి.

● పురోహితులకు డిమాండ్

పెళ్లిళ్ల సీజన్ కావడంతో పురోహితులు, మంగళ వాయిద్యకారుల కొరత ఏర్పడింది. ఇందుకోసం పౌరోహితులను తమిళనాడు, కర్నాటక తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. దీంతో ఒక్కో పురోహితుడికి రూ.10వేల నుంచి 50వేల వరకు డిమాండ్ ఉంది. ఇక భజంత్రీలకు కూడా రూ.25వేల నుం 1.50 లక్షల వరకు డిమాండ్ ఉంది. జిల్లాలోని కల్యాణ మండపాలు, సత్రాలు, దేవాలయాలు, ఫంక్షన్ హాల్స్ ఇప్పటికే బుక్ అయిపోయాయి. ఇవి దొరకని వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కల్యాణ మండపాల అద్దెలు పెరిగాయి. రూ.50వేల నుంచి 2.50లక్షల వరకు చొప్పున వసూలు చేస్తున్నారు. కల్యాణ వేదికల డెకరేషన్లు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు డెకరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. కట్నాలు, కానుకలు కాక వివాహానికి మధ్య తరగతి కుటుంబాలకు కనీసం రూ.3లక్షలు దాటుతుండగా, పెద్ద తరగతులకు సరాసరి రూ.50లక్షలకుపైగా దాటుతోంది. వివాహాల జోరు పెరగడంతో దాదాపు 36 విభాగాలకు చేతినిండా పని దొరుకుతోంది. భోజనాలు, విందులకు కూడా కనీసం రూ.లక్షన్నర నుంచి రూ.3లక్షలకుపైగా హోటల్స్ క్యాటరింగ్ సంస్థలు వసూలు చేస్తున్నాయి. ఫొటోలు, వీడియో, పాటకచేరీలు వంటి వినోద కార్యక్రమాలకు కూడా రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. బంగారం, వస్త్ర దుకాణాలు, నిత్యావసర సరుకులు, గృహోపకరణాల షోరూమ్‌లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వివాహ పత్రికలు దుకాణాలు, ముద్రణాలయాల్లోనూ ఆర్డర్లు ఎక్కువయ్యాయి. ఈ రెండు నెలలు వివాహాలకు శ్రేష్ఠమైన మాసాలు కావడంతో జిల్లా అంతా పెండ్లి బాజాలు మారుమోగుతున్నాయి.





గ్యాలరీలో సందర్శకుల సందడి



నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళుతున్న రాకెట్

షార్ సత్తా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ మరోమారు సత్తాచాటింది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి దేశ ప్రతిష్ఠను పెంచింది. వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం పంపిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని శనివారం సాయంత్రం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.18.46 నిమిషాల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ మూడు దశలను పూర్తి చేసుకొని ఉపగ్రహాన్ని విజయవంతంగా రోదసిలోకి చేర్చడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి.ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 వేలమందికి పైగా విచ్చేశారు. వీరిలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరందరూ ఉదయం నుంచే షార్ సమీపంలో ఉన్న సందర్శకుల గ్యాలరీకి చేరుకొన్నారు. రాకెట్ నింగికెగిరిన సమయంలో ప్రేక్షకుల కరతాళధ్వనులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. షార్ నుంచి ఇప్పటి వరకు 91 ప్రయోగాలు చేపట్టారు. తాజా ప్రయోగం 92వది కాగా జీఎస్ఎల్వీ-మార్క్ 2 ప్రయోగాల్లో 16వ ప్రయోగం కావడం విశేషం. కాగా ఈ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి శనివారం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ పూజలు చేశారు.అలాగే తిరుమల, శ్రీకాళహస్తీశ్వరాల యంలో జీఎస్ఎల్వీ-ఎఫ్14 నమూనాకు ప్ర త్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ ఉన్నారు.

● థర్డ్ జనరేషన్ శాటిలైట్

ఇన్‌శాట్-3డీఎస్ 3వ తరం వాతావరణ ఉపగ్రహానికి తదుపరి మిషన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఉపగ్రహం ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల సేవలకు కొనసాగింపుగా వాతావరణ సేవలను మెరుగు పరచనుంది.



రాకెట్ మొదటి దశ



రెండవ దశ



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం



ఎన్నికల విధుల నుంచి ట్రెజరీ ఉద్యోగులకు మినహాయింపు

నెల్లూరు (హరనాథపురం) : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి ట్రెజరీ ఉద్యోగులకు మినహాయింపు నిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారని ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెజరీలో బిల్లులతో పాటు ఎన్నికల ఖర్చుల బిల్లుల చెల్లింపులు, ఎన్నికల సందర్భంలో పట్టుపడ్డ డబ్బును ట్రెజరీలో భద్రపరచడం వంటి ఎన్నో విధులు ట్రెజరీ ఉద్యోగులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని తమ సంఘం తరపున ఎన్నికల ప్రధానాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మార్చి 30లోపు బకాయిలు చెల్లించాలి

● పెన్షనర్ల సంఘం డిమాండ్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 17 : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు మార్చి 30 లోపు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు నగరంలో నిరసనగా స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు తాలూకా కార్యాలయా నికి వెళ్లి అక్కడ ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్‌కె.ఖాసిం, ప్రెసిడెంట్ ఎస్ఎం.గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్‌వీ.మూర్తి, కుడుముల సుబ్బారావు, ఖాజారసూల్, తదితరులు పాల్గొన్నారు.

'బర్డ్ ఫ్లూ' కట్టడికి విశ్వప్రయత్నం

- కోవూరు, పొదలకూరులలో అధికారుల బృందం పర్యటన
- కోళ్ళ ఫారాలు, దుకాణాల మూసివేత
- కోళ్లు తరలించకుండా చెక్‌పోస్టుల ఏర్పాటు
- వైరస్‌పై ప్రజలకు అవగాహన

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 17 : జిల్లాలో బర్డ్ ఫ్లూ నివారణ చర్యలు విస్తృతంగా జరుగుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు, జడ్పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత తమ సిబ్బందిని వెంటబెట్టుకుని కోవూరు మండలం గుమ్మల దిబ్బ, దామరమడుగుతోపాటు పొదలకూరు మండలం చాటగొట్టల ప్రాంతాల్లో పర్యటించారు. రాపిడ్ బృందాలతో కలిసి బర్డ్ ఫ్లూ నివారణ చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతా ల్లోని కోళ్ల ఫారాలు, మాం సం విక్రయ దుకాణాలను మూసి వేయించారు. వ్యాధి వ్యాప్తి చెంద కుండా 344 కోళ్లను చంపి, గుడ్లను పగలగొట్టారు. మూడు రోజులపాటు దుకాణాలు తెరవకూడదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. చుట్టుపక్కల గ్రామాల్లోకి కోళ్ల తరలించకుండా చెక్‌పోస్టులు ఏర్పా టు చేశారు. పొదలకూరు మండలం లోని 24 పంచాయతీల్లో బ్లీచింగ్ చల్ల డం, పరిశరాలు పరిశుభ్రంగా ఉంచే లా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తున్నారు.

● మాంసాహార ప్రియులూ తస్మాత్ జాగ్రత్త!

ఆత్మకూరు : బర్డ్ ఫ్లూ విస్తరిస్తున్న క్రమంలో మాంసాహార ప్రియులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా అధికారులు సైతం చికెన్ విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అయితే, నగరం, పట్టణాలు, మండల కేంద్రాల్లో రోజు వందల కేజీల మటన్, చికెన్ అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి.



నెల్లూరు నగరంలోని ఓ దుకాణంలో మాంసాన్ని ఫినాయిల్‌తో నిర్వీర్యం చేస్తున్న అధికారులు

పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకర మేకలు, మేకపోతులు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను వధించాల్సి ఉంటుంది. వాటిని వధించే ముందే వైద్యాధికారులు పరిశీలించి అవి ఆరోగ్యంగానే ఉన్నాయని ధ్రువీకరించాల్సి ఉంటుంది. మాంసం అమ్మకాలు కూడా పరిశుభ్ర వాతావరణంలోనే కొనసాగాలి. లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అయితే, క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. చికెన్, మటన్ దుకాణాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా రోగాల పాలవుతున్నారు. ఆత్మకూ రులో నడిరోడ్డుపైనే చికెన్ విక్రయాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాగే మాంసం విక్రయాల్లో తూకాలు, నాణ్యత ప్రమా ణాలు పాటించడం లేదు. ప్రమాణాల మేర మాంసం విక్రయా లు జరిగేలా అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

నెల్లూరులో చికెన్ దుకాణాలు మూసేయండి

నెల్లూరు(సిటీ) : బడ్‌ఫ్లూ కారణంగా నెల్లూరు నగరంలో చికెన్ దుకాణాలు వెంటనే మూసివేయాలని ఎంహెచ్‌వో వెంకటరమణయ్య వ్యాపారులకు సూచించారు. శనివారం వెంకటేశ్వరపురం, ప్రధాన చేపలమార్కెట్, పొదలకూరురోడ్డు తదితర ప్రాంతాలలోని చికెన్ దుకాణాల్లో మాంసాన్ని ఫినా యిల్‌తో నిర్వీర్యం చేశారు. అనంతరం ఎంహెచ్‌వో మాట్లాడుతూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు చికెన్ షాపులు తెరవవద్దని స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే వారి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం నుంచి వరుసగా మూడు రోజు పాటు సచివాలయాల వారీగా ఆకస్మిక తనిఖీలు ఉంటాయని చెప్పారు.

మహీధరరెడ్డి
పయనమెటు ?

- కందుకూరులో ఏ నోట విన్నా ఇదే మాట
- వైసీపీ ఇన్చార్జిగా అరవింద నియామకంపై ఎమ్మెల్యే అనుచరుల్లో ఆగ్రహం

కందుకూరు, ఫిబ్రవరి 17: కందుకూరు ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత మానుగుంట మహీధరరెడ్డి పయనమెటు? నియోజకవర్గంలో ఏ నోట విన్నా ఇదే మాట వినిపిస్తోంది. వైసీపీలోనే టికెట్ దక్కించుకోవడమే లక్ష్యంగా మహీధర రెడ్డి పని చేస్తారా!? లేదా మరేదైనా పార్టీ లో చేరుతారా లేక ఈసారి పోటీకి దూరంగా ఉంటారా!? అన్న చర్చ నడుస్తోంది. వారం పది రోజుల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నా ప్రస్తుతం ఎవరి అంచనాలతో వారు విశ్లేషణలు చేస్తుండటం విశేషం. నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జిగా కటారి అరవింద యాదవ్ ను నియమించిన జగన్ రానున్న ఎన్నికల్లో మహీధర రెడ్డికి టిక్కెట్ లేదన్న స్పష్టమైన సంకేతాలు ఇచ్చేయ టంతో ఆయన రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్నది చర్చనీయాంశమైంది. శుక్రవారం రాత్రి ఇన్చార్జి నియామకాన్ని వైసీపీ అధిష్ఠానం ప్రకటించగా శనివారం ఉదయం నుంచి నియోజకవర్గం నలుమూలల నుంచి మహీధరరెడ్డి అను చరులు కందుకూరుకు తరలివచ్చి ఆయనకు సంఘీభావం ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మె ల్యే కార్యాలయం వద్ద కోలాహలం నెలకొనగా వచ్చిన వారంతా ఆయన్ను కలిసి 'మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మేమంతా మీవెంటే నడుస్తాం'అని తేల్చి చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును అనవస రంగా తిట్టేది లేదన్నందుకే మనకు ఈ శిక్ష అని పలు వురు ఆగ్రహం తో మాట్లాడారు. వైసీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా స్వతంత్రం అభ్యర్థిగానైనా బరిలో నిలిచి సత్తా చాటాలని ఈ సందర్భంగా పలువురు సూచిం చటం విశేషం. అయితే, వచ్చిన అనుచరు లతో ఇప్పుడు తా రుమారైంది ఏమీలేదు. ఇన్చార్జినే కదా ప్రకటించారు. నామినేషన్లు పూర్తయ్యాక కూడా అభ్యర్థులు మారే అవకాశాలు ఉంటాయి. మీరు ఓటర్ల జాబితాలు పరిశీలన, గ్రామాలలో మన వారిని సమన్వయం చేసే పనిలో ఉండండని ఎమ్మెల్యే సూచించటం విశేషం.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి!

- రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీఎన్జీఓల విజ్ఞప్తి
- నెల్లూరులో ఉద్యోగుల భారీ ర్యాలీ

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 17 : ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఏపీఎన్జీఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ.శివారెడ్డి కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం నగరంలోని బోసుబొమ్మ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలన్నారు. ఉద్యోగులు ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ఉద్యోగులుగా తమకు రావాల్సిన న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం దగ్గర ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ డబ్బులు విడుదల చేయాలని కోరారు. ఈ సభలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కోశాధికారి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ ఏపీటీఎస్ఏ నాయకులు కిరణ్‌కుమార్, దేవిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పడేది పదోతరగతిలోనే. అందుకే అటు విద్యార్థుల్లోనూ, ఇటు తల్లిదండ్రుల్లోనే ఆందోళన ఉంటుంది. ఈ గండం గట్టెక్కితే చాలన్న భావనతో విద్యార్థులు సాధన చేస్తుంటారు. ఇదే సమయంలో వారిని పరీక్షలకు సన్నద్ధం చేసి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యా శాఖపై ఉంది. మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అంటే 29 రోజులు మాత్రమే గడువు ఉండగా విద్యాశాఖ నిర్లిప్త ధోరణి, నూతన డీఈఓకు జిల్లాపై అవగాహన లేకపోవడం, విద్యాశాఖ సిబ్బంది ఇష్టారాజ్యం వెరసి విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొంది.

పదిలమేనా!?

- టెన్త్ పరీక్షలకు ఇక 29 రోజులే..
- ముంచుకొస్తున్న గడువు
- కనిపించని ప్రణాళికలు
- తూతూమంత్రంగా తరగతులు
- వేధిస్తున్న టీచర్ల కొరత
- పట్టించుకోని విద్యాశాఖ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 17 : జిల్లాలో ఏ ఈడాది పదోతరగతిలో మనం పదిలిమేనా అన్న సందేహాలను విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలల్లో జరిగిన విద్యాబోధన, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందచేసిన తీరు, వసతుల కల్పన తదితర అంశాలు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు గడువు సమీపిస్తున్నా నేటికీ విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఉపాధ్యాయుల ఆందోళనలు, సబ్జెక్ట్ టీచర్ల కొరత, కార్యాలయాల్లో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించడం, విద్యార్థులకు కనీసం ప్రత్యేక తరగతులు నిర్వహించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠ్యపుస్తకాలను సైతం ప్రభుత్వం అరకొరగా సరఫరా చేసింది. గ్రామీణ విద్యార్థులకు అన్ని పాఠ్యాంశాలు బోధించేందుకు టీచర్లకు లేక వెనుకబడి ఉన్నారు.

జిల్లాలో పదోతరగతి విద్యార్థులు..

యాజమాన్యం	రెగ్యులర్	ప్రైవేట్	మొత్తం
ఏపీ మోడల్‌స్కూల్స్	703	73	776
ఏపీఆర్‌ఈఐ సొసైటీస్కూల్స్	379	11	390
ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ స్కూల్స్	633	27	660
సెంట్రల్ స్కూల్స్	18	1	19
కేజీబీవీ స్కూల్స్	443	71	514
ఎంపీపీ-జడ్పీ స్కూల్స్	10,458	2883	13341
మునిసిపాలిటీ స్కూల్స్	1884	680	2564
ప్రైవేట్ ఎయిడెడ్	342	246	588
ప్రైవేట్ ఎయిడెడ్ ఓరియంటల్	26	7	33
ప్రైవేట్ అన్‌ఎయిడెడ్	11946	288	12234
ప్రభుత్వ పాఠశాలలు	961	355	1316
ఆశ్రమ పాఠశాలలు	63	3	66
మొత్తం	28,114	4,719	32,833

● నామమాత్రంగా ప్రత్యేక తరగతులు...

పదోతరగతి విద్యార్థులకు ఉదయం పాఠశాల సమయానికి ముందు, సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత ప్రతిరోజూ ఓ సబ్జెక్ట్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కానీ ఈ ఏడాది ఎక్కడా అలాంటి చర్యలు చేపట్టలేదు. పలు సమావేశాల్లో మాత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవేమీ లేదన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆయా ప్రధానోపాధ్యాయులే చొరవ తీసుకుని సొంత ఖర్చులతో ప్రత్యేక తరగతులు నిర్వహించుకుంటున్నారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, జిల్లాపై అవగాహన లేకపోవడం, పరిపాలనా పరమైన ఇబ్బందులు ఉండటం, కార్యాలయ సిబ్బంది సహకరించకపోవడం తదితర కారణాలతో జిల్లా విద్యాశాఖాధికారి అసంతృప్తిగానే విధులు నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు చెపుతున్నాయి. గతంలో విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి వెనుకబడిన విద్యార్థులను కొంతమంది ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ప్రత్యేకంగా శిక్షణ అందించే అంశాన్ని సైతం అధికార యంత్రాంగం పక్కన పెట్టింది. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసి చేతులు దులుపుకోవడంతోనే జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి రామారావును సంప్రదించగా గత రెండు రోజులుగా అందుబాటులో లేరని, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన సంబంధిత అధికారుల, ప్రజా ప్రతినిధుల సేవల్లో ఉన్నారని కార్యాలయ సిబ్బంది చెప్పడం గమనార్హం.

175 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు (విద్య) : విధుల్లో అలసత్వం ప్రదర్శించారన్న కారణంతో జిల్లాలో 175 మంది ప్రధానోపాధ్యాయులకు డీఈవో రామారావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజూ 10.30 గంటల లోపు యాప్ ద్వారా హాజరు వేయాలి. అయితే శుక్రవారం 3,300 మంది విద్యార్థుల హాజరు నమోదు చేయకపోవడంతో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేసి వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశించారు.


గ్యాస్ సిలిండర్ డెలివరీకి అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

నెల్లూరు(హరనాథపురం) : గ్యాస్ సిలిండర్ల డెలివరీకి అదనపు చార్జీలు వసూలు చేస్తే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకొంటామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి డి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు చార్జీలు చెల్లించాలని వినియోగదారులపై ఒత్తిడి చేస్తే వినియోగదారులు తనకు లేదా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ జిల్లాస్థాయి అధికారులకు తెలియ చేయాలని కోరారు. 18002333555 టోల్ ఫ్రీ నెంబరుకు కూడా ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చుని పేర్కొన్నారు.

బతికున్నా ఓటరుగా చంపేశారు!

- కొంతమంది చనిపోయినా బతికేస్తున్నారు
- తుది జాబితాలో తప్పులతడకలు


ఉదయగిరి, ఫిబ్రవరి 17: ఉదయగిరి నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాల్లో తప్పులతడకలు కోకొల్లలుగా ఉంటున్నాయి. మృతులకూ ఓటర్ల జాబితాలో చోటు కల్పించిన అధికారులు బతికి ఉన్నవారి పేర్లు మాత్రం గల్లంతు అయ్యాయి. వరికుంటపాడు మండలంలోని కాంచెరువు 975 పోలింగ్ కేంద్రంలో ఏడాది క్రితం మృతి చెందిన ముగ్గురి పేర్లతోపాటు డబుల్‌ఎంట్రీలు ఉన్నా యి. తూర్పుకొండారెడ్డిపల్లిలో 83వ కేంద్రంలో సుమారు రెండేళ్ల క్రితం చనిపోయిన ఏడుగురు పేర్లు జాబితాలో అలాగే ఉన్నాయి. వరికుంటపాడు 88వ పోలింగ్ కేంద్రంలో రెండేళ్ల క్రితం మృతిచెందిన ఓ వ్యక్తి పేరును జాబితా నుంచి తొలగించలేదు. వీటితోపాటు అడ్రస్ తప్పులు, వలస వాసుల ఓట్లు అలాగే ఉండడం గమనార్హం. తూర్పుకొండారెడ్డిపల్లి జాబితాలోనూ మృతుల పేర్లు ఉన్నాయి. ఇక సీతారామపురం గ్రామ పంచాయ తీలో 8వ పోలింగ్ కేంద్రంలో మృతి చెందిన పసుపులేటి లక్ష్మయ్య, మజ్జూరు చెన్నయ్యల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. అలాగే ఒకే వ్యక్తికి రెండు చోట్ల హక్కు కల్పించారు. ఇలా ఓటరు జాబితాలో తప్పులుతడకలుగా ఏర్పడి ఉన్నాయి. జాబితాలో వీటిని సవరించకపోతే దొంగ ఓట్లు వేసేందుకు అవకాశాలు ఉన్నాయని ఓటర్లు అంటున్నారు.




ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు

జాబితాలో ఎన్నెన్నో 'సిత్రాలు'

కోవూరు : కోవూరు నియోజకవర్గ ఓటర్ల జాబితాలోనూ చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. ఓటర్ల పేర్ల ఎదురుగా ప్రచురించిన ఫొటోలు రకరకాలుగా కనిపిస్తున్నాయి. కొన్ని ఫొటోల్లో వ్యక్తులను గుర్తించడం కష్టతరమవుతోంది. లేగుంటపాడు దళిత కాలనీకి చెందిన ఓటరు కండి పెంచలయ్య పేరుతో వచ్చిన ఓటు నెంబరు 243కు ఏదో శిలను ముద్రించారు. అలాగే. ఓటరు నెం702 'కలేశ' భార్య 'పేరు' 'శమశాదస్న' గా నమోదు చేయడంతో దీనిభావమేమి తరుమ లేశా అంటూ తలలు పట్టుకుంటున్నారు. 908, 909 సీరియల్ నెంబర్లకు ప్రచురించిన ఫొటోలు చీమంతవిగా కనిపిస్తున్నాయి. భూతద్దం పెట్టి చూసినా ఫొటోలో ఉన్నది ఎవరనేది గుర్తించ లేకపోతున్నారు. కోవూరు పట్టణంలో సీరియల్ నెం.232, 235 ఓటర్లను గుర్తుపట్టలేని విధమైన ఫొటోలు ప్రచురించారు. పాటూరులోని బూడిద రమణమ్మ (ఓటరు సీరియల్ నెం.362) ఫొటో విచిత్రంగా ఉంది. ఫొటోలను ముద్రించడంలో పెద్ద సంఖ్యలో తప్పులు దొర్లినట్లు ఎన్నికల అధికారులే గుర్తించారు.



పెంచలయ్య ఫొటోకు బదులు ఏదో శిల ఆకారం



ఈ మహిళ పేరు 'శమశాద స్క'నా!?



ఈ ఓటర్లను గుర్తించడం ఎలా!?

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 17: స్థానిక బీసీ కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తొలుత గుర్తుతెలియని వ్యక్తిగా భావించారు. అనంతరం పోలీసుల విచారణలో ప్రకాశం జిల్లా కనిగిరి మండలం దేవాంగ్‌నగర్‌కు చెందిన ఆవుల జిలానీ(50)గా గుర్తించారు. వివరాల మేరకు జిలానీ నాలుగు రోజులుగా దుత్తలూరులో రోళ్లకు కక్కు కొట్టి వాటిని విక్రయించి జీవనం సాగిస్తున్నాడు. ఏమైందో ఏమో శనివారం తెల్లవారేసరికి శవమై కనిపించాడు. అయితే జిలానికి మద్యం అలవాటు ఉండడంతో రాత్రి మద్యం సేవించి తాగు నీటి కోసం ఇబ్బంది పడి మృతి చెంది ఉంటాడని స్థానికులు తెలుపుతున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.



మృతి చెందిన జిలానీ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సవక తోట దగ్ధం

సంగం, ఫిబ్రవరి 17: మండలంలోని పడమటిపాళెం మజరా పల్లిపాళెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సవక తోట దగ్ధమైన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల మేరకు గ్రామానికి చెందిన నెల్లూరు ఆదిశేషయ్య, వెంకటరమణయ్య అనే ఇద్దరు రైతులు కౌలుకు 15 ఎకరాల్లో సవక మొక్కలు నాటారు. ఈ తోటలో 11-3 విద్యుత్ తీగలు ఉన్నాయి. ఈ క్రమంలో విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని నిప్పులు పడడంతో సవక తోటకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు హుటాహుటీన వచ్చి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అలాగే ఆత్మకూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సవక తోట కాలిపోవడంతో సుమారు రూ. 10 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దగ్ధమైన సవక తోట

ఇంట్లో చోరీ

వింజమూరు, ఫిబ్రవరి 17 : వింజ మూరులోని చెర్లో తోటలో ఉన్న సాయి బాబా ఆలయం వెనుక నివాసం ఉంటున్న చిలక పాటి మాలకొండయ్య ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుల ఫిర్యాదు మేరకు కావలి డీఎస్పీ వెంకట రమణ, నెల్లూరు నుంచి క్లూస్‌టీం బృందం వేలిముద్రలను సేకరించింది. ఈ సందర్భంగా కలిగిరి సీఐ ఫిరోజ్ మాట్లాడుతూ మాల కొండయ్య సతీమణి నారాయణమ్మ రోజులాగానే టైలరింగ్ నేర్చుకునేందుకు 8గంటలకు వెళ్తుంది, అలాగే పిల్లలు ఉదయం పాఠశాలకు వెళ్తారు. ఆ సమయాన్ని గుర్తించిన అగంతకులు ఇంట్లో ఎవరూ లేని సమ యంలో ఇంట్లోకి చొరబడి వంటగదికి సమీపంలో ఉన్న కిటికీ గ్రిల్స్ తీసి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న 20 సవర్ల బంగారం, రూ.20వేల నగదును తీసుకెళ్లారు. నారాయ ణమ్మ తిరిగి ఇంటికి రాగానే ఇంటి గేటు తీసి ఉండ టం చూసి అవాక్క యింది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉండాల్సిన బంగారం, నగదు చోరీకి గురైనట్లు గమనించింది. వెంటనే విషయాన్ని భర్తకు తెలిపింది. బాధితులు పోలీసులకు తెలపడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ఎస్ఐ సీహెచ్ కోటిరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	146
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	284
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5898
వెండి కిలో ధర	రూ. 74,000
వెండి ఒక గ్రాము	రూ. 76.00

కృష్ణపట్నంలో వచ్చింది ఖాళీ కంటైనర్లే!

- కేరళలో రద్దీ కారణంగా ఇక్కడకు పంపారు
- ఎగుమతులు లేవని స్పష్టం చేసిన అదానీ
- కాకాణి నోరు తెరిస్తే అబద్ధాలు : సోమిరెడ్డి ధ్వజం

నెల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం కృష్ణపట్నం కంటైనర్ టర్మినల్‌కు వచ్చిన వెజిల్ తీసుకొచ్చింది ఖాళీ కంటైనర్లనే అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేరళలోని అదానీకి చెందిన విజమ్‌జం పోర్టులో రద్దీతోపాటు స్టోరేజీ సమస్య కారణంగా ఎంఎస్ ఈ కంపెనీ ఖాళీ కంటైనర్లను కృష్ణపట్నంకు తీసుకొచ్చిందని వెల్లడించారు. నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ విషయంలో కూడా పచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్ లో ఆయన విలేకరులతో మాట్లాడు తూ'ఈ వెజిల్ రావడంతో ఓ లైనర్ కంపెనీ తమ ఎగుమతులను సౌత్ ఆఫ్రికాకు పంపాలని అదానీకి మెయిల్ పెడితే అసలు కంటైనర్ టర్మినల్ నుంచి సర్వీసులు లేవని అదానీ ఆ కంపెనీకు స్పష్టం చేసింది. వెజిల్ రాగానే ఉద్యోగులను అక్కడికి తీసుకెళతానని చెప్పిన మంత్రి, నిన్న పోర్టు బయట అక్రమ టోల్ వసూలు చేసే బ్యాచ్‌ను వేసుకొని వెళ్లి షో చేశారు' అంటూ సోమిరెడ్డి ధ్వజమెత్తారు.



అదానీ పంపిన మెయిల్‌ను చూపుతున్న సోమిరెడ్డి

● ఆయనది ఐరన్ లెగ్

మంత్రి కాకాణిది ఐరెన్ లెగ్ అని, మంత్రి కాగానే వైసీపీలో మూడు ఎమ్మెల్యే వికెట్లు పడిపోయాయని సోమిరెడ్డి అన్నారు. తాజాగా మరో ఎమ్మెల్యే జనసేనలోకి వెళుతుండగా, ఇంకో ఎమ్మెల్యే అసలు టికెటే వద్దని దండం పెట్టేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే మాగుంట లేఅవుట్ నుంచి ఓ ఎంపీ వికెట్, మినీ బైపాస్ నుంచి మరో వికెట్ లేచిపోయాయని, మరో ఎంపీ వికెట్ డైలమాలో ఉందని చెప్పారు. మరో ఎమ్మెల్యేను ఏకంగా జిల్లాలు దాటించేశారని, ఆయన చేసిన తప్పల్లా కాకాణి లాంటి దుష్టశక్తి మంత్రి అయితే జిల్లా సర్వనాశనం అవుతుందని మీటింగ్ పెట్టి చెప్పడమేనని సోమిరెడ్డి పేర్కొన్నారు. కాకాణి కారణంగా సర్వేపల్లిలో కంటైనర్ టర్మినల్ మూతపడిపోగా, జిల్లాలో ఏమో వైసీపీ మూతపడిపోతోందని ఎద్దేవా చేశారు.



విశ్వకర్మ పథకం గురించి వివరిస్తున్న పరిశ్రమలశాఖ జీఎం సుధాకర్

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్

నెల్లూరు (వెంక టేశ్వర పురం), ఫిబ్రవరి 17 : కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన విశ్వకర్మ పథకం చేతివృత్తుల వారికి ఎంతగానో ఉపయో గకరమని పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్ పేర్కొన్నారు. నగరంలోని హరిత హోటల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వకర్మ పథకం 18 వర్గాల కళాకారులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వీలు వుంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌లు, పలు శాఖల అధికారులు ఈ పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కుమార్, ప్రదీప్‌కుమార్, రవిసింగ్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్లకు ఇరిగేషన్ అనుమతులు తీసుకోవాలి


- కలెక్టర్‌కు ఇరిగేషన్ ఎస్ఈ లేఖ

నెల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్లకు అనుమతులు ఇచ్చే సమయంలో ఇరిగేషన్ శాఖను కూడా సంప్రదించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతూ ఇరిగేషన్ ఎస్ఈ పీ.కృష్ణమోహన్ కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు శనివారం లేఖ రాశారు. ఇటీవల కాలంలో ఇరిగేషన్ కాలువలు, చెరువులు, వాగులను కూడా కలుపుకొని లేఅవుట్లు వేస్తున్నారని, దాని మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఈ తన లేఖలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లేఅవుట్ వేసిన తర్వాత ప్లాట్లు కొనుగోలుదారులు ఇళ్ల కట్టుకునే సమయంలో తమ వద్దకు ఎన్‌వోసీకి వస్తున్నారని, ఎన్‌వోసీ ఇవ్వడం కుదరకపోవడంతో బ్యాంకు రుణాలు రాక కొనుగోలు దారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇరిగేషన్ ఆస్తులను కాపాడడంతో పాటు కొనుగోలు దారులకు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నుడా, మున్సిపాలిటీలు, పంచాయతీలకు లేఅవుట్ల అప్రూవల్ సమయంలో తమను కూడా సంప్రదించేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఎస్ఈ కోరారు.

సొంత పొలాల కోసం చెరువుకు 'గండి'

- నీటి కోసం చెరువులో నుంచి అక్రమ కాలువ
- వైసీపీ నాయకులను అడ్డుకున్న రైతులు

చేజర్ల, ఫిబ్రవరి17 : అసలే నీటి కొరత. ఉన్న నీటితో సర్దుకుని వరి పండిస్తున్న తరుణంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు తాము వేసిన మెట్ట పైర్ల కోసం రైతులను ముంచుతున్నారు. చెరువులో మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తరలించేందుకు సహాయంతో కాలువ తీస్తున్నారు. ఇది గమనించిన కొంతమంది రైతులు అడ్డుకున్న సంఘటన చేజర్ల మండలం గొల్లపల్లిలో శనివారం చోటుచేసుకుంది. గొల్లపల్లి పంచాయతీ చినచెరువు పెద తూము వద్ద స్థానిక వైసీపీ నాయకులు తమ పైర్లకు నీరు అందే విధంగా జేసీబీ సహాయంతో కాలువ తీయడం ఆరంభించారు. ఇది తెలుసుకున్న రైతులు వెంటనే అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. ఆయకట్టు లేకుండా మెట్టపై ర్లకు నీరు తోడేస్తే తమ పరిస్థితి ఏమిటని నిలదీశారు. అయితే, నాయకులు దురుసుగా మాట్లాడటంతో రైతులు భీష్మించి అక్కడే కూర్చున్నారు. దీంతో చేసేదిలేక వైసీపీ నాయ కులు వెనుతిరిగారు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆయకట్టు ఉన్న వారికే నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



చినచెరువు పెద తూము వద్ద తీసిన కాలువ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- డీఈవోకు బీటీఏ నేతల వినతి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17: జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీటీఏ నేతలు కోరారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రామారా వుకు బీటీఏ నేతలు వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ త్వరలో జరగ నున్న టెన్త్, ఇంటర్ పరీక్షల స్పాట్ వాల్యు యేషన్ విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి, బాలింతలు, గర్భిణులకు, 58 ఏళ్ల పైబడిన వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడంతో పాటు స్పాట్‌లో కూడా అన్ని ఏర్పాట్లు చేసి ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక కార ణాలతో అటెండెన్స్ యాప్‌లో పిల్లల హాజరు నమోదు చేయనందున ఉపాధ్యాయులకు మెమోలు ఇవ్వడం సరికాదని, వెంటనే వీటిని వెనక్కు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించి ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆది నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాన ప్రసాద్, నేతలు కృష్ణయ్య, రాజశేఖర్, మల్లికార్జున్, డ్యానియల్, రవీంద్రనాథ్, శంకరయ్య, చెన్నకేశవ, వెంకటసిద్ధార్థ్, మస్తా న్, హరి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న బీటీఏ నేతలు

● టెన్త్ స్పాట్‌లో మినహాయింపు ఇవ్వాలి : పీఆర్‌టీయూ

జిల్లాలో జరగనున్న టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌లో దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం డీఈవో రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.తిరుమలయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలని, ప్రధానంగా టెన్త్ పరీక్షల విధులు, స్పాట్ వాల్యుయేషన్, ఎన్నికల విధుల విషయంలో వయసు మళ్లిన వారికి, చంటి బిడ్డలు కలిగివారిని, బాలింతలకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటరాజు, నేతలు శ్రీనివాసులు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 20.639 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 17: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి జలాశయంలో 20.639 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 4,568 మంది హాజరు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షల్లో (ప్రాక్టికల్) జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 48 పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పరీక్షకు 4,568 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,500 మంది హాజరు కావాల్సి ఉండగా 2,445 మంది హాజరు కాగా 55 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,184 మంది హాజరు కావాల్సి ఉండగా 2,155 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్నాహ్నం కలిపి మొత్తం 4,684 మంది హాజరు కావాల్సి ఉండగా 4,600 మంది హాజరు కాగా 84 మంది గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ జరుగుతున్న పలు పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వహణ కన్వీనర్, ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు, డీఈసీ సభ్యులు పరిశీలించారు.

ఖగోళ శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 17 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నగరంలోని పలు పాఠశాలల్లో శనివారం ఖగోళశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షేక్.ఖాలేషాబాషా మాట్లాడుతూ ఖగోళ శాస్త్రవేత్త, సూర్యకేంద్ర సిద్ధాంతకర్త గియార్డినో ఫిలిపో బ్రూనో వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ఫిబ్రవరి 17వ తేదీని సత్యాన్వేషణ దినోత్సవంగా పాటించాలని, మూఢనమ్మకాలను వదిలించు కోవాలన్నారు. అనంతరం ఖగోళశాస్త్రంపై పలు అంశాలను విద్యార్థులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి డాక్టర్ శ్రీనునాయక్, లోహిత్, శశి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఖాలేషా

యువకుడి ఆత్మహత్య

- స్నేహితురాలితో కలవడం లేదన్న మనస్థాపంతోనే...

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 17: స్నేహితురాలితో కలవడం లేదన్న మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వేదాయపాలెం పోలీసుల కథనం మేరకు.. పడారుపల్లికి చెందిన జీ.వెంకట శ్రీసాయి అచ్యుత్ (28), భవానిలు 6 ఏళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే అచ్యుత్ గతంలో ఓ కెంపెనీ షోరూమ్‌లో పనిచేసే సమయంలో అక్కడే పనిచేస్తున్న ఓ యువతితో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ సన్నిహితంగా ఉండేవారు. ఈ విషయం భార్యకు తెలవడంతో ఇద్దరి మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో స్నేహితురాలికి దూరంగా ఉంటానని భార్యకు అచ్యుత్ మాటిచ్చాడు. అయితే ఆమెను విడిచి ఉండలేక పోతున్నానని, ఆత్మహత్య చేసు కుంటానని భార్యతో చెప్పేవాడు. కొన్ని నెలల కిందట భవాని కాన్పు కోసం తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. ఇదే సమయంలో అచ్యుత్ తల్లి హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లింది. మూడు నెలల కిందట భవాని పాపకు జన్మనిచ్చి ఈ నెల 15వ తేదీన భర్త వద్దకు వచ్చింది. ఆ సమయంలో కూడా తన స్నేహి తురాలు లేకపోతే చనిపోవాలని పిస్తుందని మరోసారి భార్యకు చెప్పా డు. అలాంటి పనులు చేయవద్దని తాను త్వరలో అమ్మవాళ్ల ఇంటి నుంచి వచ్చేస్తానని చెప్పి ఆమె మళ్లీ పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో 16వ తేది శుక్రవారం అచ్యుత్ తన ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఇంటి యజమాని సురేష్ మృతుడి భార్యకు ఫోను చేసి తెలియజేశారు. ఆమె నెల్లూరుకు చేరుకుని వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చుస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న అచ్యుత్

దూసుకు వచ్చిన మృత్యువు

- ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్
- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 17: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఆగకుండా జరుగుతూనే ఉన్నాయి. కావలి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాన్ని జిల్లా ప్రజలు మరువకు ముందే శనివారం నగరంలోని ఎన్‌టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై మరో ప్రమాదం జరిగింది. చెన్నై వైపు నుంచి వేగంగా వస్తున్న కంటైనర్ జాతీయ రహదారిపై అన్ని జాగ్రత్తలు తీసుకొని మెయింట్‌నెన్స్ పనుల కోసం నిలిపి ఉన్న టాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో ట్రాక్టర్ తిరగబడి ఇంజన్ కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన లుక్‌మాన్(42), అఖిల్, మధ్య ప్రదేశ్‌కు చెందిన ఆశిష్‌కుమార్‌లు ఉపాధి నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. విగ్రమ్‌నగర్‌లోని అర్జున్ వైష్ణవి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. లుక్‌మాన్ డ్రైవింగ్, మిగిలిన ఇద్దరు వివిధ పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో శనివారం అఖిల్, ఆశిష్‌కుమార్‌లు ఎన్‌టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో రోడ్డుపైకి వస్తున్న చెట్టు కొమ్మలను కత్తిరించారు. లుక్‌మాన్ చెత్తను తీసుకు వెళ్లేందుకు ట్రాక్టర్ తీసుకొని వచ్చాడు. అఖిల్, ఆశిష్‌కుమార్‌లు చెత్తను ట్రాక్టర్ ట్రాలీలో వేస్తుండగా చెన్నై వైపు నుంచి నాగలాండ్ వెళుతున్న కంటైనర్ వేగంగా వచ్చి వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టి డివైడర్ మీదకు దూసుకువచ్చింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది. లుక్‌మాన్ ట్రాక్టర్ ఇంజన్ కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లుక్‌మాన్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కంటైనర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కంటైనర్ డ్రైవర్, క్లీనర్ పరారీలో ఉన్నారు. మృతదేహాన్ని మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ట్రాక్టర్‌ను ఢీకొని డివైడర్‌పైకి ఎక్కిన కంటైనర్

ప్రభుత్వ మొండివైఖరితోనే ఉద్యమ బాట : జేఏసీ



కావలి టౌన్ : ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కావలి టౌన్, ఫిబ్రవరి 17: ప్రభుత్వ మొండివైఖరితోనే ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారని జేఏసీ చైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందించారు. శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరికి ఉద్యోగులు విసిగిపోయి ఉద్యమ బాట పట్టారన్నారు. 30శాతం ఐఆర్ ఇవ్వాలని, డీఎ, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రావు, ఫ్యాప్టో మధు, దీక్షితులు, బ్రహ్మయ్య, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు రమణయ్య, ఆర్టీసీ ఎన్ఎంయు కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కందుకూరు తాలూకా యూనిట్ జేఏసీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల సాధనకై రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ చైర్మన్ బీ శైలజ, ప్రధాన కార్యదర్శి బల్లి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గోవర్ధన్, బషీరా, ట్రెజరర్ సుప్రియ పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఐక్యత ఆధ్వర్యంలో ఉద్యమ శంఖారావం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, రియాజ్, నాయబ్, శ్రీనివాసులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ స్టాల్స్ తనిఖీ



చికెన్ స్టాల్స్ తనిఖీ చేస్తున్న కమిషనర్ ఫజుల్లలా

ఆత్మకూరు, ఫిబ్రవరి 17 : జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతున్న నేపథ్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లలా సిబ్బందితో కలిసి చికెన్ స్టాల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చికెన్ స్టాల్స్ నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ప్రజలు సైతం కొన్ని రోజులు చికెన్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్‌ఐ షేక్ ఖాసీం, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 17: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం నోడల్ అసిస్టెంట్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే కళాశాలల్లో ఓటు హక్కు కలిగిన వారికి ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఖాజారంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



సురేంద్రరెడ్డిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కావలి, ఫిబ్రవరి 17: వైసీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శిగా ఎంపికైన కాటా సురేంద్ర రెడ్డిని కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ తనను వైసీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కావలికి అదనపు జిల్లా కోర్టు మంజూరుకు, న్యాయవాదులకు ప్రభుత్వం తరఫున ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం జయప్రకాష్, ఇన్‌చార్జి ప్రెసిడెంట్ రిషికుమార్ సభ్యులు పీ శ్రీనివాస మూర్తి, ఎస్వీ రాజేంద్రప్రసాద్, శేషుప్రసాద్, సాయిప్రసాద్, బీ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

కందుకూరు, ఫిబ్రవరి 17: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఎన్ విజయ్‌బాబు తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో, సివిల్, వివాహ సంబంధ కేసులు, కుటుంబ వివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కేసులతో పాటు రాజీ చేయదగిన అన్ని క్రిమినల్ కేసులను కూడా పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

లింగసముద్రం, ఫిబ్రవరి 17: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని వీఆర్ కోట, అంగిరేకులపాడు, అన్నెబోయినపల్లి, మొగిలిచెర్ల గ్రామాల సమీపంలోని మన్నేరు నుంచి, పెదపవని సమీపంలోని ఉప్పుటేరు నుంచి రేయింబవళ్ల ఇసుక అక్రమంగా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు నుంచి కందుకూరుకు యదేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. కాగా, ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల వేగానికి వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అలాగే అన్నెబోయినపల్లి నుంచి లింగసముద్రంకు అర్ధరాత్రి నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇక పెదపవని నుంచి ప్రతిరోజూ చుట్టుపక్కల గ్రామాలతో పాటు కావలికి ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మన్నేరు, ఉప్పుటేరుల నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిరిపురం, చలంచర్ల రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కావలి రూరల్, ఫిబ్రవరి 17: కావలి మండలం సిరిపురం, చలంచర్ల రోడ్ల నిర్మాణాలకు శనివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కంపూడి రమేష్‌బాబు, ఎంపీపీ ఆలూరి కొండమ్మ, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, వైసీపీ నాయకులు నాయుడు రాంప్రసాద్, గోపాల క్రిష్ణయ్య, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, నాగన్నగారి శ్రీను, ఇరువూరి శ్రీహరినాయుడు, కమతం బలరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు



ఊంజల సేవలో శ్రీనివాసుడు

బిట్రగుంట, ఫిబ్రవరి 17: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామికి అర్చకులు సత్యనారాయణాచార్యులు, లక్ష్మీ నరసింహాచార్యులు, కల్యాణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన వేమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కావలికి చెందిన చిన్నపురెడ్డి భువనేశ్వర్‌రెడ్డి, సిద్ద నారాయణరెడ్డి అన్నసంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి మాట్లాడుతూ ప్రవాస భారతీయులు బచ్చు వెంకటకృష్ణయ్య, సంధ్య దంపతులు డాక్టర్ అమరా బచ్చు ట్రస్ట్ ద్వారా నిర్మించిన అన్నదాన, కార్యాలయ భవనాల ప్రారంభోత్సవం సోమవారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఓబుల్‌రెడ్డి, తులసిరామ్, మాల్యాద్రి, విశ్రాంత ఇంజనీరు గోపికృష్ణ, భక్తులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 6,47,178

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 17: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 6,47,178 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోతరం టిక్కెట్‌ల ద్వారా రూ. 5,600, కుంకుమార్చన ద్వారా రూ. 21,280, వివాహముల ద్వారా రూ. 6 వేలు, తలనీలాలు ద్వారా రూ. 25,425, వాహనపూజలు ద్వారా రూ. 4,140, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 1,48,300, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 8,80, రూముఅద్దెలు ద్వారా రూ. 32,170, కవర్లు ద్వారా రూ. 5,100, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,85,015, అన్నదానం ద్వారా రూ. 2,09,668, విరాళముల ద్వారా రూ. 3,600 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరం : ఎంవీఐ



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న ఎంవీఐ

కావలి రూరల్, ఫిబ్రవరి 17: రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరం అని మోటారు వాహనాల ఇన్స్‌పెక్టర్ సుందరరావు పేర్కొన్నారు. కావలి పట్టణ శాంతినగర్‌లోని శ్రీచైతన్య సీబీఎస్ఈ క్యాంపస్‌లో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనతో పాటు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్ పాల్గొని మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు గురైన వారిని కాపాడే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాలల ప్రిన్సిపాల్స్ శైలేష్ కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లూమాక్స్ కంపెనీకి 'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక

కందుకూరు, ఫిబ్రవరి 17: చెన్నైలోని శ్రీ పెరంబూర్ పారిశ్రామిక కేంద్రంలో ఉన్న ఎస్ఎల్ లూమాక్స్ ఆటోమొబైల్ కంపెనీకి ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు 50 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె విజయ్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్, మెకానికల్ బ్రాంచిలకు చెందిన 62మంది విద్యార్థినీ, విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా వారిలో 50మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు కంపెనీ ప్రతినిధులు మెయిల్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. కార్పోరేట్ రంగంలో ఉద్యోగ సంక్షోభం నెలకొన్న తరుణంలో ఒకే కంపెనీకి 50మంది ఎంపికవటం హర్షణీయమని, ఇందుకోసం కృషిచేసిన టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అభినందించారు.

అరాకొరా రేషన్ మాకొద్దు

● కొత్తూరు గ్రామస్థుల నిరసన



ఎండీయు వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

బిట్రగుంట, ఫిబ్రవరి 17: నెలలో సగం రోజులు అయిపోయాక అరాకొరా రేషన్ సరుకులు మాకు అక్కరలేదని ఎంపీటీసీ ఏకే సుందర్‌రాజ్, కొత్తూరు గ్రామస్థులు శనివారం ఎండీయు వాహనాన్ని అడ్డుకున్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలోని రేషన్ షాపు నెంబరు-8 నిర్వాహకుడు గత 6 నెలలుగా రేషన్ షాపులో సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని, ఈ విషయం మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకు పోయినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో డీఎంవో వాహనాన్ని అడ్డుకున్నామన్నారు. అంతేకాకుండా అన్ని రేషన్‌షాపులలో చక్కెర, కందిపప్పు తదితర వస్తువులు ఇస్తుంటే కొత్తూరులో కేవలం బియ్యం కొందరికి మాత్రమే అందచేస్తున్నారని ఆవేదన చెందారు. ఉన్నత అధికారులు వెంటనే స్పందించి రేషన్ షాపు డీలరును తొలగించాలని గ్రామస్థులు కోరారు.

టుబాకో బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్ల నియామకంపై హర్షం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 17 : టుబాకో బోర్డు చైర్మన్‌గా శింగమనేనిపల్లె గ్రామానికి చెందిన చిడిపోతు యశ్వంత్‌కుమార్, వైస్ చైర్మన్‌గా వలేటివారిపాలెం గ్రామానికి చెందిన గుత్తా వాసుబాబు నియామకంపై మండల తెలుగురైతు నాయకులు గుర్రం లక్ష్మీనరసింహంతో పాటు రెండు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు కృషి చేయాలని లక్ష్మీనరసింహం కోరారు.

పాసు పుస్తకాలు ఇచ్చి భూములు చూపించండి

● తహసీల్దారు కార్యాలయం ఎదుట దళితుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

అల్లూరు, ఫిబ్రవరి 17: రీసర్వే ప్రక్రియ తరువాత తమ పేర్లతో మంజూరైన పాసు పుస్తకాలు ఇవ్వాలని, భూములు చూపించాలని అల్లూరు దళితులు శనివారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమకు నార్తుఆములూరు రెవెన్యూ పరిధిలో భూములు కేటాయించి పట్టాలు మంజూరు చేశారన్నారు. కొంతమంది లీజుకు అని చెప్పి తమను మోసంచేసి భూములు తీసుకొని లీజు అగ్రిమెంట్లు రాయించుకొని ఇతరులకు విక్రయించి అక్రమంగా గ్రావెల్‌ను తవ్వుకొని సొమ్ము చేసుకున్నారని వాపోయారు. తమ పేర్లపై వచ్చిన పాసు పుస్తకాలు, భూములు తమకు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు దుర్గేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముసలి నరేంద్రు, గాలి రాజా, పాలెపు జయరాం, దానం మాల్యాద్రి, దర్శిగుంట వాసు, కర్రా మల్లికార్జున్. ఎల్లు ఏసురత్నం, దానం బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

నా పొలం నా పేరు మీద ఉండేలా చేయండి

● తహసీల్దారుకు దివ్యాంగుడి వినతి



కేతు రమణయ్య

చేజర్ల, ఫిబ్రవరి 17: గత 30 సంవత్సరాల నుండి తాను పొలం సాగు చేసుకుంటున్నా తన పేరుమీద లేదని, స్పందన కార్యక్రమంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయిందని చేజర్ల మండలం మాముడూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు కేతు రమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మాముడూరు గ్రామంలో సర్వే నెంబరు 364-20,21లోని సిజెఎఫ్‌లో ఎ1-93 సెంట్లు భూమిని సాగు చేసుకుంటున్నానని, ఈ భూమి కోసం శనివారం కూడా చేజర్ల తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేసినట్లు రమణయ్య తెలిపాడు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వికలాంగుడైన తనకు న్యాయం చేయాలని కోరాడు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, ఫిబ్రవరి 17: కందుకూరు గ్రామదేవత అంకమ్మ అనివేటి మండపం నిర్మాణం కోసం గంగవరపు వెంకటేశ్వర్లు, నాగమణి దంపతులు శనివారం రూ. 25011 విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు కొడాలి కోటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో గంగవరపు పవన్‌కుమార్, అర్చన దంపతులు, గంగవరపు అనిల్‌కుమార్, శ్రీలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

సీఎం సభకు బస్సులు
ప్రయాణికుల అవస్థలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 17: అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఆదివారం జరగనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభకు శనివారం జిల్లాలోని పలు ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు తరలివెళ్లడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉదయగిరి డిపోలో 65 బస్సులు ఉండగా 25 బస్సులను సిద్ధం సభకు తరలించారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నెల్లూరు, ఇతర ప్రాంతాలకు బస్సులు గంటల తరబడి రాకపోవడంతో ప్రయాణికులు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అరకొరగా వచ్చిన బస్సుల వద్ద ప్రయాణికుల రద్దీ నెలకొంది. బస్సులను రాజకీయ సభలకు పంపడం, తమను ఇబ్బందులకు గురి చేయడంపై పలువురు ప్రయాణికులు ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేశారు.

బీజేపీ బహిరంగ సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కావలి టౌన్, ఫిబ్రవరి 17: నెల్లూరు వీఆర్సీ మైదానంలో ఈనెల 22వ తేదీన జరగనున్న బీజేపీ బహిరంగ సభ, 23నుంచి జరగనున్న ప్రజాపోరు కార్యక్రమాలను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు జీ భరత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఓ హోటల్ సమావేశ మందిరంలో నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం, ప్రజాపోరు జిల్లా కోకన్వీనర్ బెల్లంకొండ కిషోర్ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు వింతా రంగారెడ్డి పాల్గొని పై కార్యక్రమాలు విజయవంతం అయ్యేందుకు తీసుకోవాల్సిన అంశాలపై కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నవీన్, మందా కిరణ్ పాల్గొన్నారు.

సారికాదేవి అలంకారంలో శ్యామలాదేవి

వింజమూరు, ఫిబ్రవరి 17 : వింజమూరులోని ప్రసన్నరెడ్డినగర్‌లో ఉన్న శ్రీహరిపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్యామలాదేవి అమ్మవారు శుక్రవారం దేవి నవరాత్రులలో భాగంగా సారికా దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. సారిక శ్యామల కళలు, సంగీతంద నృత్యం భక్తులకు కనువిందు చేశాయని ఆలయ ప్రధాన అర్చకులు సాయి స్వామి తెలిపారు. కార్యక్రమంలో అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

సులభరీతిలో విద్యాబోధన చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సులభరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని గుడినరవ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలన్నారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 17: దశాబ్దాల తరబడి అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో పలు గ్రామాల ప్రజలు శనివారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంపూర్తి రోడ్డుపై కొండకింద గ్రామాలకు చెందిన సుమారు 15 వేల మంది రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. స్పందించిన ఆయన తక్షణమే అటవీ, రెవెన్యూ ఉన్నతాధికారులతో చర్చించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అనంతసాగరం, ఫిబ్రవరి 17: మండలంలోని ఇస్కపల్లి, రేవూరులో శనివారం విజయాభవయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి పలు సమస్యలు తెలుపగా పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.

మద్యం సీసాల స్వాధీనం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 17: మండలంలోని నందిపాడు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణంపై శుక్రవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఉమాశంకర్ శనివారం తెలిపారు. ఈ దాడుల్లో 12 మద్యం సీసాలతో పాటు నిర్వాహకుడు బత్తుల వెంగయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 17: అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీకి రూ.30 వేలు జరిమానా విధించినట్లు ఉదయగిరి సెబ్ సీఐ ఆర్‌వీ రమణమ్మ తెలిపారు. శనివారం దుత్తలూరులోని 565 జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో సంగం నుంచి దర్శికి ఇసుకతో వెళ్తున్న లారీ 15 టన్నులు అధికంగా తీసుకెళ్లడాన్ని గుర్తించామని, దీంతో జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మురళీకృష్ణ, కానిస్టేబుళ్లు జయచంద్రయ్య, తిరుపతయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కావ్య'కు మద్దతు

కావలి, ఫిబ్రవరి 17: కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డికి పీఏటీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, ఏబీఎం సంస్థల అధినేత జీడీడీ దివాకర్ తన మద్దతు తెలిపి బంపర్ మెజా ర్టీతో గెలిపిస్తానని తెలిపారు. ఈమేరకు శనివారం తొలుత క్రిష్ణారెడ్డి తన అనుచరులతో దివాకర్ ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తదుపరి దివాకర్ తన అనుచరులతో కావ్య ఇంటికి వెళ్లి తన మద్దతు తెలిపి క్రిష్ణారెడ్డి ఎంపికలో చంద్రబాబు నాయుడు సరైన నిర్ణయం తీసుకున్నారన్నారు. కావలిని అభివృద్ధి చేయగల నాయకుడు క్రిష్ణారెడ్డి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు కే మూర్తిబాబు, జేఎం ఫ్రాంక్లిన్, పాస్టర్స్ ప్రెసిడెంట్ ఏసుబాబు, కన్వీనర్ థామస్, ఒంగోలు జగన్ డేవిడ్‌సన్, జయపాల్, అడ్వకేట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శన అడ్డుకోవటం పిరికిపంద చర్య : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కావలి, ఫిబ్రవరి 17: రాజధాని ఫైల్స్ సినిమా అడ్డుకోవటం పిరికిపంద చర్య అని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావులు మాట్లాడుతూ రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శిస్తే జగన్‌ను ప్రజలు ఎక్కడ ఛీకొడతారోనని తాడేపల్లి ప్యాలెస్ వణికి పోతోందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికలలో జగన్‌రెడ్డి ఓడిపోవటం ఖాయమని, టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తటవర్తి వాసు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 17: ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలంతా సంసిద్ధంగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం రాత్రి మండలంలోని బలిజపాలెం గ్రామంలో పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. పార్టీలోకి కొత్తగా చేరికలను ప్రోత్సహించేలా నేతలంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, తోకల మధుబాబు, ఏకాంబరం వెంకటరావు, ఏకాంబరం నాగేశ్వరరావు, తోకల రామచంద్రయ్య, దార్ల శ్రీను, సాధు వేణు, ఎన్వీ సుబ్బారావు, పొడపాటి మహేష్, రావుల రవి, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో జనసేన - టీడీపీ విజయం తథ్యం : అళహరి

● నేడు జనసేన పార్టీ కార్యాలయ భవనం ప్రారంభం

కావలి టౌన్, ఫిబ్రవరి 17: రానున్న ఎన్నికల్లో జనసేన - టీడీపీ విజయం తథ్యమని, వైసీపీని ఇంటికి పంపడం ఖాయమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం జనసేన నియోజకవర్గ పార్టీ కార్యాలయం కోసం తుమ్మలపెంట రోడ్డు వద్ద నిర్మించిన నూతన భవనం ప్రారంభోత్సవం జరగనుందన్నారు. ఈకార్యక్రమంలో జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆరం ఖాన్, రాష్ట్ర నాయకులు వేములపాటి జనార్ధన్, జాని మాస్టర్, జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటలకు జెండాచెట్టు వద్దనుంచి పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు.

వైసీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శిగా షౌకత్ అలీ

ఏఎస్‌పేట, ఫిబ్రవరి 17: అనుమసముద్రం గ్రామానికి చెందిన షేక్ షౌకత్ అలీ వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడి పని చేసినందుకు తగిన గుర్తింపు లభించిందని, మరింత ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం ఇచ్చిన సీఎం జగన్‌కు, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డెర పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా బాలకోటేశ్వరరావు నియామకం



బాలకోటేశ్వరరావును అభినందిస్తున్న దేవెళ్ళ వెంకట్

కావలిటౌన్, ఫిబ్రవరి 17: వడ్డెర పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా కావలి మండల రుద్రకోటకు చెందిన వల్లెపు బాలకోటేశ్వరావు నియమితులయ్యారు. గుంటూరు అరండల్ పేటలోని సమితి హాల్‌లో జరిగిన రాష్ట్ర బీసీ వడ్డెర పరిరక్షణ సమితి సమావేశంలో రాష్ట్ర వడ్డెర పరిరక్షణ సమితి అధ్యక్షుడు దేవెళ్ళ వెంకట్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాలకోటేశ్వరావును నియమించారు. బాలకోటేశ్వరావు మాట్లాడుతూ వడ్డెర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈనెల 25న గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో జరగనున్న వడ్డెర యువగర్జనకు వడ్డెర యువత, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని బాలకోటేశ్వరావు పిలుపునిచ్చారు.

రైతు సంక్షేమానికి టీడీపీ తొలి ప్రాధాన్యత



కలిగిరి: బొల్లినేనితో యువకులు

కలిగిరి, ఫిబ్రవరి 17: వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్లలో రాష్ట్రంలో రైతన్న కడుపునిండా పట్టెడన్నం తిన్నదే లేదని, తెలుగుదేశం పార్టీ మాత్రమే రైతు సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే, ఉదయగిరి నియోజకవర్గ తెలు గుదేశం పార్టీ ఇన్‌చార్జి బొల్లినేని వెంక టరామారావు పేర్కొన్నారు. మండలం లోని నాగసముద్రం పంచాయతీ లో శనివారం జరిగిన ప్రజాదీవెన యాత్ర లో బొల్లినేని మాట్లాడుతూ ప్రజా స్పందన చూస్తుంటే టీడీపీ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. సోమశిల ఉత్తర కాలువపై బ్రిడ్జి నిర్మించి పంచాయతీవాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించి యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా యువకులు బొల్లినేని వెంట నడిచి తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బిజ్జం కృష్ణారెడ్డి, యర్రగుంట రమణారెడ్డి, అంబటి శంకరయ్య, నరసాల మాల్యాద్రి, కాకు మహేష్, ఊసా మాల్యాద్రి, కల్లూరి చంద్రమౌళి, స్వర్ణ కొండయ్య, బొగ్గవరపు వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నీరిచ్చి ఆదుకోవాలి

కొండాపురం : రాళ్లపాడు ఆయకట్టు రైతులకు ఒక్క తడి నీరిచ్చి ఆదుకోవాలని ఉదయగిరి మాజీ ఎమ్మె ల్యే బొల్లినేని వెంకటరామారావు డిమాండ్ చేశారు. మండలంలోని సాయిపేట పంచాయతీలో మెట్టపైర్లు సాగుచేసిన రైతులు నీటి కోసం నానా తంటాలు పడుతుండడంతో స్పందించిన బొల్లినేని శనివారం గ్రామంలో సాగుచేసిన పొగాకు, మిరప, పత్తి పైర్లను టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను నిర్లక్ష్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని, రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే స్పందించి నీటిని విడుదలచేయించి ఆదుకోవాలని వైసీపీ ప్రభుత్వాన్ని కోరారు. అంతకుముందు గ్రామ టీడీపీ నాయకుడు ఘంటా వెంకటేశ్వర్లు కుమారుడి వివాహ వేడుకలలో పాల్గొన్నారు. ఆయన వెంట కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, రైతు కార్యదర్శి పీ రమేష్, కుంకు మోహనరావు, వల్లూరు వెంకటేశ్వర్లు, చాగంటి క్రిష్ణ, నర్రా శివన్నారాయణ, బొల్లినేని వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సమరానికి సంసిద్ధం

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న నారాయణ

నెల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రానున్న ఎన్నికల సమరానికి సంసిద్ధం కావాలని శ్రేణులకు మాజీ మంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ దిశానిర్దేశం చేశారు. శనివారం గోమతినగర్‌లోని తన కార్యాలయంలో ఆయన నగర నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ, ఓటర్ల జాబితా పరిశీలన తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో పడకేసిన అభివృద్ధి పనులను కూడా వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, ముప్పాళ్ల విజేత, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో అజీజ్ పర్యటన

నగర నియోజకవర్గ పరిధిలోని 51వ డివిజన్‌లో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ శనివారం పర్య టించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతి రాజధానిని స్వాగతిసున్నామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి, అధికా రంలోకి రాగానే మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట మొదలు పెట్టారని అజీజ్ దుయ్యబట్టారు. కాగా నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి 40వ డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ రానున్న ఎన్నికల్లో నారాయణకు అండగా నిలబడాలని అభ్యర్థించారు.

20న సామూహిక సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 17 : నగరంలోని పప్పులవీధి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 20న భీష్మ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని పాదర్తి బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు 54 మంది దంపతులు వ్రతంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

● సహస్ర విష్ణునామ పారాయణం

భీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయం, ధనలక్ష్మీపురంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతుందని ఆలయ భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 7గంటల నుంచి రాత్రి 8గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని కోరింది.

షార్ శాస్త్రవేత్తలకు అభినందన

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 17: జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 ద్వారా ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టడం దేశానికే గర్వకారణమన్నారు.

నూతన చేరికలతో టీడీపీలో మరింత ఉత్సాహం



టీడీపీలో చేరిన అశోక్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో శనివారం భారీగా చేరిన వారికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు కండువాలు కప్పి స్వాగతం పలికారు. వైసీపీ నేత, మాలమహానాడు నగరాధ్యక్షుడు కమతం అశోక్ వందల మంది యువతతో ర్యాలీగా రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన రాపూరు అంకయ్యతో పాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. 22వ డివిజన్‌కు చెందిన నాయుడు మనోజ్‌రెడ్డి, మరికొంత మంది టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్‌లో టీడీపీ-జనసేన కూటమి ఇప్పటికే బలంగా ఉందని, నూతన చేరికలతో మరింత పటిష్టపడుతుందన్నారు. పార్టీలో చేరుతున్న ప్రతీ ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 160 స్థానాల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించి అధికారంలోకి రాబోతోందని, చంద్రబాబు సీఎం కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ, నాయకులు అల్లాభక్షు, పముజుల ప్రదీప్, జలదంకి సుధాకర్, రాపూరు చంద్రశేఖర్, కంటే సాయిబాబా, అరవ శ్రీనివాసులు, నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, యోగానందం, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) : గేయ రచయిత మురళీమోహన్‌రాజు టీడీపీ విజయం కోసం తలవంచని యోధుడా.. అమరావతికి ఆద్యుడా అనే పాటను రాశారు. ఆ పాట సీడీని శనివారం రూరల్ ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మురళీమోహన్‌రాజు నారా లోకేష్ కోసం గరళంపై యువగళం, జయహో బీసీ సందర్భంగా రాసిన అదిగదిగో బీసీ రాజ్యం తదితర పాటలు ప్రజాదరణ పొందాయని తెలిపారు. తాజాగా రాసిన పాట కూడా పాపులర్ కావాలని ఆశిస్తున్నానన్నారు. అనంతరం మురళీమోహన్‌రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ షేక్.షంషుద్దీన్, పాండు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న జన సైనికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 17: అల్లీపురం లోని టిడ్కో ఇళ్లలో కరెంటు మీటరు వద్ద షాక్ తగిలి మృతి చెందిన చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. ఈ మేరకు శనివారం నెల్లూరు రూరల్ డిప్యూటీ తహసీల్దారును కోరారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించకుండానే అల్లీపురం టిడ్కో ఇళ్లకి తరలించడంతో కరెంటు మీటరు షాక్ తగిలి ఓ చిన్నారి గత సంవత్సరం మృతి చెందిందన్నారు. చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని వారికి పరిహారం ఇవ్వాలని గతంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నా ఇప్పటి వరకు ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



కార్మికుల సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 17: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఏఆర్ఎస్)లో రోజువారి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులకు కార్మికశాఖ జారీ చేసిన వేతనంతో కూడిన జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ ఏఆర్ఎస్‌లో పనిచేస్తున్న రోజువారి కూలీలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో భాగంగా నెల్లూరు ముత్తుకూరు రోడ్డులోని ఆకుతోట వద్ద ఉన్న ఏఆర్ఎస్‌లో చేపట్టిన రెండోరోజు సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కార్మికులు సహజంగా మరణిస్తే రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం చెల్లించేలా చేసిన జీవోను కాంట్రాక్టు లేబర్‌కి కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ ప్రధాన కార్యదర్శి కిన్నెర కుమార్, నాయకులు ప్రసాద్, శ్రీదేవి, నాగభూషణం, రమ్య, సుబ్బులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలే లక్ష్యంగా పని చేస్తున్నాం : మంత్రి కాకాణి



చిట్టేపల్లి ఆర్బీకే ప్రారంభోత్సవంలో మంత్రి కాకాణి

పొదలకూరు, ఫిబ్రవరి 17 : అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడమేగాక పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం పొదలకూరు మేజర్ పంచాయతీలోని చిట్టేపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం, అంతర్గత సిమెంటు రోడ్లకు సుమారు రూ.2.80కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొదలకూరు గ్రామ పంచాయతీ పరిధిలో పొదలకూరు, లింగంపల్లి, చిట్టేపల్లి గ్రామాల పరిధిలో ఒక్క అంతర్గత సిమెంటు రోడ్లకే రూ.13.65కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. అలాగే రూ.9.20కోట్లతో సైడ్ కాలువలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ లైన్ల సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు వంటి పనులకు రూ.2.25కోట్లు ఖర్చు చేశామన్నారు. అంతేకాకుండా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళల ఖాతాల్లో రూ.18,750 వంతున మూడు విడతలు చెల్లించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలతో వైసీపీ కండువాలు కప్పారు

తోటపల్లి గూడూ రు, ఫిబ్రవరి 17 : వైసీపీ నాయకులు తమ కుటుంబాలను ప్రలోభాలు పెట్టి వైసీపీ కండువాలు కప్పారని, ముత్యాల కుటుంబాలు టీడీపీలోనే ఉన్నారని టీడీ పీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కోవెరపాలెంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మాజీ మంత్రి సోమిరెడ్డి హయాంలోనే తమ గ్రామాభివృద్ధి జరిగిం దని, ఈనెల 13న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటన సందర్భంగా 40 కుటుంబాలు వైసీపీలో చేరినట్లు అసత్య ప్రచారాలు చేశారన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి కృషితోనే స్మశానానికి దారి కూడా కల్పించి గ్రామంలో మౌలిక వసతులు కల్పించారని పేర్కొన్నారు. సమావేశంలో తెలుగు యువత టీడీపీ ప్రధాన కార్యదర్శి గంగపట్నం సుధీర్‌బాబు, గ్రామ అధ్యక్షులు తలమంచి నాగేశ్వరరావు, బీసీ సెల్ నేత భట్టికాల శివప్రసాద్, పెళ్లకూరు శివప్రసాద్, ముత్యాల గణేష్, స్థానిక టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై గోవిందుడు



గరుడ వాహనంలో శ్రీనివాసుడు

పొదలకూరు, ఫిబ్రవరి 17 : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా నాల్గవ రోజైన శనివారం గరుడ వాహనంపై గోవిందుని గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారు గరుడ వాహనంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవల్లో పాల్గొనే భక్తులు సకల పాపాలు తొలగిపోతాయని నమ్మకం. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలు దేవరకొండ వెంకటసుబ్బయ్య ధర్మపత్ని లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

మానవ సేవయే మాధవ సేవ

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 17 : మానవసేవయే మాధవ సేవ అని ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయాధికారి జింకారెడ్డి శేఖర్ అన్నారు. శనివారం నగరంలోని పరివార్ ప్యారడైజ్‌లో నిర్వహించిన మెర్సీ ఆఫ్ యూనివర్స్ ట్రస్టు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దాతృత్వం చాలా గొప్పదని చెప్పారు. ప్రతి ఒక్కరూ తనకున్న దానిలో ఎంతోకొంత ఎదుటి వారికి సహాయం చేయాలన్నారు. బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, మెర్సీ ఆఫ్ యూనివర్స్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు షాహీముర్ రెహమాన్, ఫజులుర్ రెహమాన్, విడవలూరు డీటీ అజీజుల్లాఖాన్, ట్రస్టుకు చెందిన ఫైజూర్ రెహమాన్, మొహ్మద్ రియాజ్, న్యాయవాది షాజహాన్, వైద్యుడు సందీప్ పాల్గొన్నారు.

కొలువుదీరిన జొన్నవాడ పాలకవర్గం

● చైర్మన్‌గా శ్రీనివాసులురెడ్డి



పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 17 : జొన్నవాడలోని మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ పాలకవర్గం శనివారం కొలువుదీరింది. ఆలయంలో జరిగిన ప్రమాణస్వీకారంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా చైర్మన్‌గా మావులూరి శ్రీనివాసులురెడ్డి, సభ్యులుగా గాజుల సుజన, బట్టేపాటి విజయమ్మ, ఆములూరు విమల, ఇన్నమూరు త్రిశూనలక్ష్మి, గుమ్మా రఘురామయ్య, కోటంరెడ్డి రాఘవరెడ్డి, ముంగర శివకుమార్, సూరాయపాళెం రామకృష్ణ, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా చిక్కుడు వెంకట కామేశ్వర ప్రసాద్‌లతో ఆలయ ఈఓ వి.గిరికృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు పాలకమండలి సభ్యులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

వరదరాజస్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

మండలంలోని జొన్నవాడలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వరదరాజస్వామి ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. చైర్మన్‌గా పిల్లెళ్ల సాగర్, సభ్యులుగా రాపూరు సుబ్బమ్మ, శింగిరి సుమతి, ఇండ్ల రమణయ్య, పుట్టా మల్లికార్జున, పిల్లెళ్ల శ్రీలక్ష్మి, నెల్లూరు మల్లికార్జున, ఎక్స్ అఫిషియో మెంబరుగా పరాంకుశం తేజా స్వరూప్‌లతో ఆలయ ఈఓ వి గిరికృష్ణ ప్రమాణస్వీకారం మరియు రహస్య ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌తో రైతుల ఇబ్బందులు

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 17 : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు 9గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు గంటల విద్యుత్ ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులను ఎన్నిసార్లు ఈ విషయమై అడిగినా వారు మాట దాటవేస్తున్నారన్నారు. పొలాలకు నీరు సరిగ్గా అందకపోవడంతో నానాఅగచాట్లు పడుతున్నామని, అంతేకాకుండా ఇచ్చే విద్యుత్ కూడా నిరంతరం అంతరాయంతో ఇవ్వడంతో రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయన్నారు. అధికారులు స్పందించి రైతులకు 9 గంటల విద్యుత్ ఇచ్చేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

'గీతాంజలి'లో వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ ప్రదర్శనలో మాట్లాడుతున్న ఎంఈవో

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 17 : నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీగీతాంజలి పాఠశాలలో శనివారం సీవీ రామన్ సైన్స్, ఆర్ట్స్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథి గా హాజరైన నెల్లూరు ఎంఈవో తిరుపాల్ ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆలోచనలతో అత్యాధునికమైన ప్రాజెక్టులను అందరికీ అర్థమయ్యే రీతిలో ఎగ్జిబిట్ చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో కేవీ.నరసయ్య, ఎస్ఆర్‌కే పాఠశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తి, పాఠశాల కరస్పాండెంట్ వై.వెంకటరామయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తున్న యశ్వంత్‌సింగ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 17: నగరంలోని చిన్నబజారు బీజేపీ కార్యాలయంలో శనివారం ఉజ్వల గ్యాస్ పథకం కింద ఏడుగురికి ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పాల్గొని మాట్లాడుతూ మహిళల కోసం కేంద్ర ప్రభుతం ఉజ్వల గ్యాస్ పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు జగదీష్, ఏ కుమార్ రాము, పెంచలయ్య, నరేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటేపల్లిలో కళాజాతా కార్యక్రమం



కళాజాతను నిర్వహిస్తున్న కళాకారులు

వెంకటాచలం, ఫిబ్రవరి 17 : మండంలోని కంటేపల్లి పంచాయతీ గిరిజన కాలనీ, బీసీ కాలనీలలో శనివారం విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన ప్రతి ఆడబిడ్డను చదివించాలని, వారి చదువులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నటువంటి కార్యక్రమాలను వివరించారు. అనంతరం జాతీయ సేవా పథకం వాలంటీర్లు గ్రామంలో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ కే.సునీత, ఐసీపీఎస్ ప్రొటెక్షన్ అధికారి సమతా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, తదితరులు ఉన్నారు.

తెలుగుదేశంతోనే సమగ్రాభివృద్ధి

● మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల



ఆషూకు నియామకపత్రం అందచేస్తున్న వాదనాల

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 17 : తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాల మహానాడు విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా అరవ అషూను నియమించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యమై ఎస్సీల సంక్షేమం కరువైందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంటే తామంతా నడుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాయల మేరీ, ఉష, కొప్పోలు రఘు, చేను సుజాతమ్మ, అరుణాకృపాకర్ పాల్గొన్నారు.

భూమి సారవంతంగా ఉంటేనే మంచి దిగుబడులు

● కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు అవగాహన



భూమి సారవంతంపై వివరిస్తున్న అధికారులు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 17 : భూమి సారవంతంగా ఉంటేనే పంటలో దిగుబడులు అధికంగా వస్తాయని ఆత్మ పీడీ దొరసాని, ఎస్టీఎల్ ఏడీ కన్నయ్య విద్యార్థులకు వివరించారు. శనివారం కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు మట్టిలోని సారంవతాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. రైతులు మట్టి నమూనాలతో భూసారాన్ని తెలుసుకోవాలన్నారు. మట్టి నమూనాలను సేకరించడంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో 6,7,8 తరగతుల విద్యార్థులు, ఏవో నిర్మల, కేవీకే శాస్త్రవేత్త అనూష, విద్యాలయ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి

సైదాపురం, ఫిబ్రవరి 17: గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేపట్టిన అభివృద్ధి తప్ప, వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని చీకవోలు పంచాయతీ అన్నంరాజుపల్లి గ్రామంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ చంద్రబాబు నాయుడు మహిళల కోసం ఏర్పాటు చేసిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు నలమారు వెంకటేశ్వర్లు రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి తోట శ్రీనివాసులు రెడ్డి, బూత్ కన్వీనర్ కొండూరు శంకర్ రాజు, ఐటీడీపీ తాళ్లపాక పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీఏ ఎల్ఎల్‌బీ పరీక్షలు

వెంకటాచలం, ఫిబ్రవరి 17 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఐదో రోజైన శనివారం జరిగిన బీఏ ఎల్ఎల్‌బీ 3వ, 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 3వ సెమిస్టర్‌కు 394 మంది, మధ్యాహ్నం 5వ సెమిస్టర్‌కు 350 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానందకుమార్‌బాబు తెలిపారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ కోట నీలమణికంఠ పరీక్షలను పర్యవేక్షించారు.

శిలాఫలకాలు కాదు.. ప్రజా సమస్యలు తీర్చండి : దినేష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 17 : నియోజకవర్గంలో శిలాఫకాలు ఆవిష్కరిస్తే అభివృద్ధి కాదని, ముందు ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని ఉద్దేశించి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. 'ప్రతి అడుగు ప్రజల కోసం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన 11వ వార్డులో పర్యటించారు. కేంద్రం రూ.కోట్ల నిధులు ఇస్తున్నా బుచ్చిలో అభివృద్ధి ఎందుకు జరగడంలేదని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. అనంతరం దినేష్‌ను ఆర్యవైశ్యులు, వ్యాపారులు సన్మానించారు.

● చిల్లర చేష్టలొద్దు : సూరా

చిల్లర చేష్టలు వద్దు.. రాజకీయంగా పోరాడుదాం రా అంటూ వవ్వేరు బ్యాంకు మాజీ చైర్మన్, టీడీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యే ప్రసన్నకు సవాల్ విసిరారు. శనివారం బుచ్చిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 60 రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయని, ఎన్నికల తర్వాత ఎవరు మెజారిటీ ఏంటో చూసుకుందాం రా అని పేర్కొన్నారు. 'నేను అవినీతి చేస్తే పక్కన పెట్టనన్నావు. నన్ను 5రోజులు జైల్లో పెట్టించి బ్యాంకులో అన్ని పరిశీలించావు. అవినీతి ఉంటే బయటపెట్టు. నీ అప్పులకు నేను కట్టినవి 3 ప్రామిసరీ నోట్లు, 6 చెక్కులు ఇప్పటికీ నా దగ్గరే ఉన్నాయి. నేనూ ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టగలను. కానీ అంత హీనమైన పనులు చేయను' అని మండిపడ్డారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఎంవీ. శేషయ్య, చైతన్య, బత్తల హరికృష్ణ, హరనాథ్, ప్రభాకర్‌రెడ్డి, వుసురుపాటి, సుబ్బారావు, ప్రభాకర్, కిషోర్, శీను తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించండి : కమిషనర్



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వికాస్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 17 : ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాకే నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల అధికారులకు ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ల వారీగా దరఖాస్తులను ఆయా బీఎల్వోలతో పాటు సూపర్‌వైజర్లు బాధ్యత తీసుకుని విచారణ చేపట్టాలన్నారు. ఎక్కడ ఎలాంటి లోపం జరగడానికి వీలుండకూడదన్నారు. ఫారం 6,7,8లను స్వీకరించినప్పుడు వాస్తవాలను గుర్తించాలన్నారు. అనంతరం ఎన్నికల విధులపై చర్చించారు.

శివాజీ జయంత్యుత్సవాలకు తరలిరండి

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 17 : నగరంలో ఈనెల 19వ తేదీ జరిగే ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలకు అందరూ తరలిరావాలని ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ ఉత్సవాన్ని భావితరాలకు పోరాట స్ఫూర్తి, దేశభక్తిని పెంపొందించేందుకు 5 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. వీఆర్ హైస్కూల్ మైదానం నుంచి ర్యాలీ ప్రారంభమై గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీసెంటర్, కనకమహల్ సెంటర్, కొత్తహాలు, సండేమార్కెట్‌ల మీదుగా వీఆర్సీ మైదానంకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడు పీజీ మహేష్, అమర్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

20న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

పొదలకూరు, ఫిబ్రవరి 17 : పట్టణంలోని చోళుల కాలం నాటి శ్రీవిఘ్నేశ్వర, కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20న మంగళవారం మాఘమాసం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శివకేశవులకు ప్రీతికరమైన భీష్మ ఏకాదశి రోజున రామలింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు పీబీఎస్‌వీ ప్రసాద్ స్వామి, చొప్పా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ 20న ఉదయం 8గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, విశేష అభిషేక ద్రవ్యములతో స్నపన తిరుమంజనం, ఉదయం 10గంటలకు సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి చందనాలంకారం జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు కోరారు.



నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోతున్న జీఎస్ఎల్వీ రాకెట్



రాకెట్ మొదటి దశ



రెండవ దశ



మూడవ దశ



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

షార్ సత్తా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ మరోమారు సత్తాచాటింది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి దేశ ప్రతిష్టను పెంచింది.వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం పంపిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని శనివారం సాయంత్రం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.18.46 నిమిషాల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ మూడు దశలను పూర్తి చేసుకొని ఉపగ్రహాన్ని విజయవంతంగా రోదసిలోకి చేర్చడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి.ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 వేలమందికి పైగా విచ్చేశారు. వీరిలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరందరూ ఉదయం నుంచే షార్ సమీపంలో ఉన్న సందర్శకుల గ్యాలరీకి చేరుకొన్నారు.రాకెట్ నింగికెగిరిన సమయంలో ప్రేక్షకుల కరతాళధ్వనులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.షార్ నుంచి ఇప్పటి వరకు 91 ప్రయోగాలు చేపట్టారు. తాజా ప్రయోగం 92వది కాగా జీఎస్ఎల్వీ-మార్క్ 2 ప్రయోగాల్లో 16వ ప్రయోగం కావడం విశేషం.కాగా ఈ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి శనివారం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ పూజలు చేశారు.అలాగే తిరుమల ఆలయంలో, శ్రీకాళహస్తీశ్వరాలయంలో జీఎస్ఎల్వీ- ఎఫ్14 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ ఉన్నారు.

థర్డ్ జనరేషన్ శాటిలైట్

ఇన్‌శాట్-3డీఎస్ మూడవ తరం వాతావరణ ఉపగ్రహానికి తదుపరి మిషన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఉపగ్రహంలో వాతావరణ పరిస్థితిని అంచనా వేయగల అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ ఉపగ్రహం ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల సేవలకు కొనసాగింపుగా వాతావరణ సేవలను మెరుగుపరచనుంది.



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏందిది జగనా?

- ప్రయాణికులు ఏమైపోతేనేం?... సిద్ధం సభ సజావుగా సాగితే చాలు!!
- జిల్లానుంచీ 374... తిరుపతినుంచే అత్యధికంగా 119 ఆర్టీసీ బస్సుల కేటాయింపు
- తిరుమల డిపోనూ వదలని వైనం... 52 బస్సుల మళ్లింపు
- తిరుగు ప్రయాణంలో సతమతమైన యాత్రికులు
- 300 విద్యా సంస్థల బస్సులు అదనం

డిపోల వారీగా పంపిన బస్సులు

తిరుపతి - 62 , తిరుమల - 52
అలిపిరి డిపో- 27, మంగళం- 30
గూడూరు- 30, పుత్తూరు- 42
శ్రీకాళహస్తి- 45, వెంకటగిరి- 25
వాకాడు-21, సత్యవేడు-20
సూళ్ళూరుపేట-20

తిరుపతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో నేడు జరగనున్న వైసీపీ సిద్ధం బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు జిల్లానుంచీ ఏకంగా 374 ఆర్టీసీ బస్సులు కేటాయించేశారు.అంటే సగానికి పైగా బస్సులు జిల్లా ప్రయాణికులకు మూడురోజులు అందుబాటులో వుండనట్టే. సభ జరిగేది ఆదివారమైతే శనివారం తెల్లవారుఝామునే కేటాయించిన మండలాలకు, గ్రామాలకు బస్సులను తరలించేశారు. దీంతో శని, ఆదివారాలతో పాటు బస్సులు తిరిగి డిపోలకు చేరే సోమవారం దాకా ప్రయాణికులకు జిల్లాలో ఈ దురవస్థ తప్పేలాలేదు.



తిరుపతి బస్టాండులో బస్సుల కోసం ఎదురుచూపులు



తిరుపతిలో బస్సుల్లేక వెనుదిరుగుతున్న ప్రయాణికులు

తిరుమల యాత్రికుల అవస్థలు

తిరుపతి నుంచీ తిరుమల వెళ్ళడానికి బస్సుల కొరత పెద్దగా కనిపించలేదు. అయితే తిరుమల నుంచీ తిరుగు ప్రయాణమై తిరుపతి బస్ స్టేషన్ చేరుకున్న ప్రయాణికులకు మాత్రం స్వస్థలాలకు వెళ్ళడానికి చుక్కలు కనిపించాయి. దాదాపుగా దూర ప్రాంతాలకు వెళ్ళే బస్సులన్నీ వైసీపీ సభకు కేటాయించడంతో తీవ్ర బస్సుల కొరత ఏర్పడింది. దీంతో అడపాదడపా వచ్చిన బస్సుల్లో చొరబడేందుకు యత్నించి ప్రయాణికులు అవస్థల పాలయ్యారు. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు గంటల తరబడీ బస్సుల కోసం పడిగాపులు కాయాల్సివచ్చింది.

గూడూరు, వెంకటగిరి డిపోలు ఖాళీ

గూడూరు ఆర్టీసీ డిపోలో వున్నదే మొత్తం 45 బస్సులు. అందులో ఏకంగా 30 బస్సులను సిద్ధం సభకు పంపించేశారు. దీంతో మిగిలిన 15 బస్సులతో చాలా పరిమిత సేవలు మాత్రమే శనివారం అందించారు. గూడూరు నుంచీ నెల్లూరు, తిరుపతి, వెంకటగిరి తదితర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. వెంకటగిరి డిపోలో మొత్తం 32 బస్సులుంటే 25 బస్సులు సభ కోసం కేటాయించారు. దీంతో కేవలం ఏడు బస్సులతో రెండు రోజులు నెట్టుకురావాల్సి వస్తోంది. దీనివల్ల రాపూరు, నాయుడుపేట ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు బాగా అసౌకర్యానికి గురవుతున్నారు. వాకాడు డిపోలో 40 బస్సులుంటే 20 బస్సులు వైసీపీ సభకు కేటాయించడంతో సగం బస్సులతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇక్కడి నుంచీ నెల్లూరు, గూడూరు వెళ్ళడానికి ప్రత్యామ్నాయం లేక సతమతమయ్యారు. సూళ్ళూరుపేట డిపోలో మొత్తం 42 బస్సులుంటే అందులో 20 బస్సులు సభకు జన సమీకరణ కోసం పంపించేశారు. దీంతో నెల్లూరు, తిరుపతి, చెన్నై తదితర ప్రధాన మార్గాలతో పాటు గ్రామీణ ప్రాంత సర్వీసులు కూడా రద్దయ్యాయి.



శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ముక్కంటి క్షేత్రంలో ప్రయాణికుల అగచాట్లు

శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో వంద బస్సులున్నాయి. వాటిలో 40 బస్సులను జగన్ సభ కోసం మళ్ళించారు. 40 శాతం బస్సులు తగ్గిపోవడంతో నెల్లూరు మార్గంలోనూ, గ్రామీణ రూట్లలోనూ బస్సులు రద్దయ్యాయి. దీంతో ప్రధానంగా నెల్లూరు వైపు వెళ్ళాల్సిన ప్రయాణికులు గంటల కొద్దీ బస్ స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. పుత్తూరు డిపోలో 77 బస్సులుండగా 41 బస్సులను సభకు మళ్ళించిన ఫలితంగా తిరుపతి, నగరి, చిత్తూరు, సత్యవేడు మార్గాల్లో బస్సులు సరిపోక ప్రయాణికులు తీవ్ర అవస్థ పడ్డారు. అలాగే అప్పలాయగుంట, బాదూరు, పచ్చికాపల్లం, గొల్ల కండ్రిగ, విజయపురం, పుల్లూరు, పాలసముద్రం, నింద్ర, కేవీబీపురం తదితర గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే జనం ఉదయం నుంచే ఇబ్బంది పడ్డారు. సత్యవేడు డిపోలో 50 బస్సులుండగా 20 బస్సులు సభ కోసం కేటాయించడంతో తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు, సూళ్ళూరుపేట తదితర ముఖ్యమైన మార్గాల్లో రోజంతా కలిపి రెండు మూడు బస్సులే నడిచాయి. దీంతో ఈ మార్గాల్లో వెళ్ళాల్సిన ప్రయాణికులు నానా అవస్థ పడ్డారు.

20నుంచి భువనేశ్వరి పర్యటన

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 20వ తేదీనుంచి చిత్తూరు,తిరుపతి జిల్లాల్లోని ఆరు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టయి జైలుకెళ్లినప్పుడు ఆవేదనతో మరణించిన వారి కుటుంబాలను ఆమె 23వ తేదీ వరకూ పరామర్శించనున్నారు.

యాత్రకు రండి...ప్లీజ్!



చంద్రగిరిలో సినిమా హాలు వద్దకు బస్సుల్లో తరలిస్తున్న జనం

'రండి బాబూ రండి, రండి తల్లీ రండి...మీకోసం లగ్జరీ బస్సు పెట్టాం. ఇంటర్వెల్లో స్నాక్స్ కూడా ఇస్తాం. బిందాస్‌గా వచ్చి సినిమా చూసి వెళ్లండి' అంటూ చంద్రగిరి నియోజక వర్గ ప్రజల వెంట పడుతున్నారు వైసీపీ నాయకులు. జగన్ ప్రచారం కోసం తీసి విడుదల చేసిన యాత్ర-2 సినిమా థియేటర్లు వెలవెలపోతుండడంతో వాటిని నింపడానికి నానా అవస్థలూ పడుతున్నారు. శనివారం నుంచి చంద్రగిరిలో యాత్ర-2 సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు జనాన్ని తరలించే ఏర్పాట్లు ఘనంగానే మొదలు పెట్టారు. ప్రత్యేక షోలు ఏర్పాటు చేశారు. పంచాయతీకి రెండు బస్సులు చొప్పున సిద్ధం చేశారు. ఎమ్మెల్యే పీఏ ఆర్వోల ద్వారా ఈ సమాచారాన్ని పంచాయతీల పరిధిలోని సచివాలయాలకు చేర్చారు. వలంటీర్ల ద్వారా ప్రేక్షకులను రాబట్టే ప్రయత్నం చేశారు. పెద్ద పంచాయతీలకు ప్రత్యేక లగ్జరీ బస్సులను పంపారు. చిన్న పంచాయతీలకు మినీ బస్సులను పంపారు. బస్సులను థియేటర్ వద్ద నిలిపి అందులోని వారిని దగ్గరుండి హాలు లోపలకు సాగనంపారు.ఇంటర్వెల్ సమయంలో సమోసా, కూల్‌డ్రింక్స్ అందించారు.చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలూ కవరయ్యేలా ప్లాన్ చేశారు. మరో మూడు రోజుల పాటు యాత్ర-2 సినిమాను ఆడేలా చేయాలన్న సంకల్పంతో వైసీపీ నేతలున్నారు. ఇందులో భాగంగా శనివారం మార్నింగ్ షో చూపించాలని తొలుత భావించారు. కానీ అనుకున్నంత స్పందన లేకపోవడంతో వారిని మ్యాట్నీకి మార్చారు. తొలిరోజే స్పందన లేకపోతే మిగిలిన రోజులు ఎట్లస్వామీ అని కార్యకర్తలు, వలంటీర్లు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

విద్యాసంస్థల నుంచీ 300 బస్సుల మళ్ళింపు

జిల్లావ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల నుంచీ రాప్తాడు సభకు 300 బస్సులను మళ్ళించారు. వీటిలో ప్రధానంగా తిరుపతి నగరం నుంచే అత్యధికంగా తరలి వెళ్ళాయి. ప్రతి విద్యా సంస్థ నుంచీ సగం బస్సులు కేటాయించాలని అధికారులు హుకుం జారీ చేయడంతో శనివారం ఉదయాన్నే బస్సులన్నీ నిర్దేశిత మండలాలకు, గ్రామాలకు బయల్దేరి వెళ్ళాయి. దీంతో శనివారం ఆయా విద్యా సంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు సొంతంగా రాకపోకలు సాగించగా హైస్కూలు లోపు విద్యార్థులను తల్లిదండ్రులు వదిలిపెట్టాల్సి వచ్చింది. కొన్ని చోట్ల విద్యా సంస్థలే విద్యార్థుల కోసం ఆటోలు పంపించాయి.

పాపం...పిల్లలు



బాలాయపల్లి బస్టాండు వద్ద విద్యార్థుల పడిగాపులు

బాలాయపల్లి , ఫిబ్రవరి 17:.బాలాయపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 350మంది విద్యార్థులున్నారు.వీరిలో బాలాయపల్లి మండలంలోని వెంకటరెడ్డిపల్లి ,అంబలపూడి,గూడూరు మండలం గొల్లపల్లి ,నెన్నూరు ,కొమ్మనేటూరు , చెమిర్తి , తిప్పవరపాడు గ్రామాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్నారు.ఆర్టీసీ బస్సులు సిద్ధం సభకు వెళ్లడంతో వెంకటగిరి - గూడూరు మార్గంలో బస్సులు లేక సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

23 సవర్ల బంగారం అపహరణ

వెంకటగిరి, ఫిబ్రవరి 17: వెంకటగిరి పట్టణంలోని మూలసాలివీధిలో తాళం వేసిన ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.... మూలసాలివీధిలో నివాసం ఉంటున్న పద్మావతి, సుబ్రహ్మణ్యం దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రథసప్తమి సందర్భంగా తిరుమల దర్శనానికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో ఇచ్చి వెళ్లారు. సాయంత్ర ఇంటి వచ్చి తాళాలు తీసి లోనికి వెళ్లగా బీరువా తలుపులు తెలిచి ఉన్నాయి. అందులో ఉన్న 28 సవర్ల బంగారు ఆభరణాలు, కొంత నగదు కనిపించలేదు. చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం క్లూస్ టీమ్ వచ్చి వేలుముద్రలు సేకరించింది. ఇంటికి వెనుక వైపు తలుపులు మూశారా లేదా అన్న విషయం బాధితులు స్పష్టంగా చెప్పడంలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

సాగునీరు అందక ఎండుతున్న వరి



నీరు అందక ఎండిన వరి పైరు

వాకాడు, ఫిబ్రవరి 17: పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన వరిచేను సాగునీరులేక నెర్రెలు చాటుతూ ఎండిపోతోంది. గూడూరు నియోజకవర్గంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల రైతులు వరి పంటపైనే ఆధారపడి జీవనాధారం సాగిస్తున్నారన్నారు. మూడు మండలాల్లో సుమారు 34వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారన్నారు. స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాల పంటలకు బోర్ల ద్వారా సాగునీరు అందిస్తుండగా, చెరువుల కింద చేపట్టిన వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల్లో నీరు అడుగంటిపోయింది. దీంతో వేల ఎకరాల్లో వరిపంట వాడుముఖం పట్టింది. ముఖ్యంగా వాకాడు మండలంలో దుగరాజపట్నం, తిరుమూరు, రాయగుంటపాళెం, కోట మండలంలో కొత్తపాళెం, చిట్టమూరు మండలంలో మల్లాం, చిట్టమూరు గ్రామాల్లో పంటలు ఎక్కువగా ఎండిపోతున్నాయి. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో కరువు ఛాయలు కన్పిస్తున్నా ప్రభుత్వం, అధికార యంత్రాంగం అదేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్ విమర్శించారు. తెలుగుగంగ జలాలను తీసుకురాలేని వైసీపీ నాయకులు, అధికారులు కనీసం సేవ్ ద క్రాప్ పథకం ద్వారా బోర్లు వేయించి రైతులను ఆదుకోవాలని కోరారు.

కులధృవీకరణ పత్రాల మంజూరులో జాప్యం వద్దు

గూడూరు, ఫిబ్రవరి 17: ఓబీసీ అభ్యర్థుల కులధృవీకరణ పత్రాల మంజూరులో ఆలస్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూలకు అర్హత సాధించిన ఓబీసీ అభ్యర్థులు కులధృవీకరణ పత్రాల కోసం వారం రోజులుగా అధికారుల వద్దకు తిరుగుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి ఓబీసీలకు కులధృవీకరణ పత్రాలను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధనుష్, లీలాప్రశాంత్, జయ, ఆకాష్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి అనూషా

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 17: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి కోర్టు సివిల్ జడ్జి అనూషా అన్నారు. శనివారం స్థానిక 1వ సచివాయల పరిధిలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు, ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీపీ ప్రకృతి కుమార్, రాజారావు, రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుకు వేలం నిర్వహించొద్దు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని కోటపోలూరు పెద్దన్న చెరువులో చేపల వేటకు వేలం నిర్వహించరాదని గ్రామస్తులు డీఎల్‌పీవోకు వినతిపత్రం ఇచ్చారు. చెరువులో చేపల వేట వల్ల నీళ్లంతా కలుషితమై పోతున్నాయని, ఈ విషయమై మత్స్యశాఖ, మండల అధికారులు విన్నవించుకొన్నా పట్టించుకోలేదన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి


గూడూరు, ఫిబ్రవరి 17: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని దివిపాళెం గ్రామ సమీపంలో రైల్వేగేటు వద్ద శనివారం ఓ వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... చిల్లకూరు గ్రామానికి చెందిన ఆదినారాయణ(45) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. శనివారం దివిపాళెం రైల్వేగేటు వద్ద పట్టాలు దాటుతుండగా గూడూరు నుంచి చెన్నై వెళుతున్న పినాకిని ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో మృతిచెందాడు. అదేవిధంగా స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులదిబ్బ ప్రాంతం వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని, ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వేజీఆర్ పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17: సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెం సమీపంలో శనివారం తెల్లవారుజామున 33 కేవీ విద్యుత్ లైను తగిలి లారీ డ్రైవర్ ఏలూరు భాస్కర్(49) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... సూళ్లూరుపేట మండలం ఇలుపూరు గ్రామానికి చెందిన నాగరాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి వట్రపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్దకు లారీలో ఇసుక తీసుకెళ్లాడు. ఇసుకను దింపేందుకు లారీపై ఉన్న పట్టను తీసేందుకు పైకి ఎక్కాడు. పైన ఉన్న 33 కేవీ విద్యుత్ లైను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రహీంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

చిల్లకూరు, ఫిబ్రవరి 17: మండలంలోని బూదనం టోల్ ప్లాజా వద్ద శనివారం మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సాధిక్ పెద్ద బ్యాగ్‌తో అనుమానాస్పదంగా సంచరిస్తుండంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. సాధిక్‌ను అరెస్టు చేశారు.



మృతి చెందినా ఓటర్ల జాబితాలో ఉన్న మహదేవయ్య, మునిరత్నయ్య పేర్లు

మృతులందరికీ ఓట్లు

చనిపోయినవారు 200కు పైనే ● అందరికీ జాబితాలో చోటు

కోట, ఫిబ్రవరి 17: కోట మండల పరిధిలోని 21 పంచాయతీల్లో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తుది ఓటర్ల జాబితా ప్రకారం మండలంలో 41,547 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 20,033, స్త్రీలు 20,510 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. అయితే ముసాయిదా జాబితాలోని తప్పులు యథాతథంగా పునరావృతం అయ్యాయి. సుమారు 200 మంది మృతుల ఓట్లు తొలగించలేదు. ఇక ఇంటి నెంబరు లేని ఓటర్లు, డబుల్ ఎంట్రీలు ఎక్కువగానే ఉన్నారు. తిమ్మనాయుడుపాళెంలోని 199వ పోలింగ్ బూత్‌లో 968 మంది ఓటర్లు ఉండగా, అందులో 10 మంది చనిపోయినా వారి పేర్లు తుది జాబితాలో అలాగే ఉన్నాయి. ఈ బూత్‌లో మహదేవయ్య అనే ఓటరు దాదాపు పదేళ్ల క్రితం చనిపోయినప్పటికీ ఓటరు జాబితాలో పేరు కొనసాగుతోంది. అదేవిధంగా వెంకన్నపాళెం 197వ పోలింగ్ బూత్‌లో 890మంది ఓటర్లు ఉండగా, 20 మంది చనిపోయిన వారి పేర్లు తుదిజాబితాలో ఉండటం విశేషం. ఇక్కడ మునిరత్నయ్య అనే ఓటరు మృతి చెందినా జాబితాల్లో పేరు తొలగించలేదు. అదేవిధంగా కోట పట్టణంలోని 201వ పోలింగ్ కేంద్రం పరిధిలో ముగ్గురు, 206వ పోలింగ్ కేంద్రం పరిధిలో పది మంది, 207వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఐదుగురు చనిపోయినా వారి జాబితా నుంచి తొలగించలేదు.

చంద్రబాబుతోనే రామరాజ్య స్థాపన: కురుగొండ్ల



కరపత్రాలు అందజేస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో రామరాజ్య స్థాపన చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని 4వ వార్డు కుమ్మరి మిట్ట, రహమత్ నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టును, వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే అస్త్రంతో ముఖ్యమంత్రి సైకో జగన్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాదర్, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, తాండవ చంద్రారెడ్డి, మల్లారం బాబు, సుదా, రవి, రుద్రాక్ష, కౌశల్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 17: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 విజయం కోసం

చెంగాళమ్మకు పూజలు



ఇస్రో చైర్మన్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని శనివారం ఇస్రో చైర్మన డాక్టర్ ఎస్.సోమనాథ్ దర్శించుకొన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారికి పూజలు చేశారు. ఇస్రో చైర్మన్‌కు ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనంతరం వేద పండితులు ఆశీర్వవచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వెలుపల ఇస్రో చైర్మన్ విలేకర్లతో మాట్లాడుతూ జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ద్వారా వాతావరణ అధ్యయనం కోసం ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపుతున్నామన్నారు. కౌంట్‌డౌన్ ప్రారంభమై సజావుగా సాగుతోందని తెలిపారు. జూన్ మాసంలో మరో జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహ ప్రయోగం ఉంటుందన్నారు. అదే విధంగా ఎస్ఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ ప్రయోగాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

బాబును సీఎం చేసి... రాష్ట్రాన్ని కాపాడుకుందాం: పాశం



ఆలేటిపాడులో కరపత్రాలను అందజేస్తున్న సునీల్‌కుమార్

చిట్టమూరు, ఫిబ్రవరి 17: చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని కాపాడుకుందామని గూడూరు టీడీపీ ఇన్‌చార్జి పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆలేటిపాడు గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం కోసం ఎంతటి దుర్మార్గానికైనా పాల్పడుతారని అన్నారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమం కోసం పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య, రషీద్, కల్లూరు మణి, మోహన్ తదితరులు ఉన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, ఫిబ్రవరి 17: గూడూర కోర్టు ఆవరణలో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులను అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళీధర్, సులోచనారాణి, లోకనాథం, శంకరయ్య, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏపీజేఏసీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీజేఏసీ గూడూరు తాలూకా యూనిట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 15లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల, కార్మికుల, పెన్షనర్ల, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి న్యాయబద్ధంగా రావాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణమే అందించాలన్నారు. తాము దాచుకున్న సొమ్ము వేల కోట్ల రూపాయలు బకాయిలుగా నిలిచిపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు నివేదించినా పరిష్కరించే దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయడంతో పాటు 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. ఇక ఖాళీగా వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాల్సి వుండగా కేవలం 6వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వ్యతిరేక చర్యలను మానుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించాల్సివుంటుందన్నారు. కార్యక్రమంలో రవి, తనూజ్, చిరంజీవి, బాబు, సుధీర్, సుబ్రహ్మణ్యంరాజు, మోహన్‌దాస్, ఖాదర్‌బాషా, బాషా తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

గూడూరు, ఫిబ్రవరి 17: విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మసూద్‌అహ్మద్, డీఆర్‌డబ్ల్యూ కళాశాల అధ్యాపకులు సౌజన్య, గాయత్రి అన్నారు. శనివారం స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్‌ఎక్స్‌పో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని భవిష్యత్తులో దేశం గర్వించదగ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేయండి

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 17: వెంకటగిరి పట్టణంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని నియోజకవర్గ బీజేపీ సమన్వయ కర్త ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని తిరుపతి రోడ్డులో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్య నాయుడు వెంకటగిరికి 2వేల ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. టీడీపీ పునాదులు వేసి ఇస్తే, వైసీపీ పూర్తి చేసి లబ్ధిదారులను అందించడంలో విఫలమైందన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు.

వలంటీర్లకు సత్కారం

పెళ్లకూరు, ఫిబ్రవరి 17: పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు భవనంలో వలంటీర్ల సత్కార సభ శనివారం నిర్వహించారు. వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైసీపీ మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, కరణం రఘు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి శనివారం సన్మానించారు. స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

తడ, ఫిబ్రవరి 17: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం కింద చేపట్టిన 668 పనులకు శనివారం సోషల్ ఆడిట్ జరిగింది. జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో 18 పంచాయతీల్లో సుమారు రూ.4.44 కోట్లతో చేసిన పనులకు ఆడిట్ నిర్వహించారు. రూ.1.97 లక్షల రికవరీకి ఆదేశించారు. రికార్డుల నిర్వహణ సరిగా లేదని రూ.1.64 లక్షల జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏపీడీ రవికుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతి, ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో ఆమోస్‌బాబు, ఏపీవో విజయభాస్కర్, గణేష్ పాల్గొన్నారు.

24న శ్రీవారి పాదప్రతిష్ఠ

నాయుడుపేట, ఫిబ్రవరి 17: నాయుడుపేట - తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి దేవస్థానంలో ఈనెల 24వ తేదీ శ్రీవారి పాదప్రతిష్ఠ, సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు జనార్ధన్ శనివారం తెలిపారు. సత్యనారాయణస్వామి వ్రతానికి విచ్చేసే భక్తుల పూజకు కావాల్సిన సామగ్రిని నిర్వాహకులే అందిస్తారు.

క్రీడాకారుడికి నివాళి



నివాళులర్పిస్తున్న క్రీడాకారులు

గూడూరు, ఫిబ్రవరి 17: క్రికెట్ క్రీడాకారుడు భాస్కర్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. శనివారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సంతాప సభ నిర్వహించారు. భాస్కర్ చిత్రపటానికి క్రీడాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరయ్య, మల్లికార్జున, టీఆర్ మణి, భరణి, శ్రీనివాసులు, లవ, మధు, కరిముల్లా, నాగేశ్వరరావు, రజిని, విజయ్, నూర్‌అహ్మద్, సురేష్, దీపు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి

నాయుడుపేట, ఫిబ్రవరి 17: నాయుడుపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని నాయుడుపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు పాపాడి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిగురాకుల సురేంద్రబాబు అన్నారు. నాయుడుపేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గోపీని శనివారం శాలువాతో సత్కరించారు. పట్టణంలోని సమస్యలను వివరించారు.

బస్సుల కోసం విద్యార్థుల పడిగాపులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 17: బస్సుల కోసం విద్యార్థులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. బాలాయపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 350 మంది పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. బాలాయపల్లి మండలంలోని వెంకటరెడ్డిపల్లి, అంబలపూడి, గూడూరు మండలం గొల్లపల్లి, నెన్నూరు, కొమ్మనేటూరు, చెమిర్తి, తిప్పవరపాడు గ్రామాల విద్యార్థులు బాలాయపల్లి పాఠశాలకు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. శనివారం ఆర్టీసీ బస్సులు సీఎం సభకు వెళ్లడంతో విద్యార్థులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

గూడలిలో మాఘమాస పూజలు

కోట, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని గూడలిలో గల శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో శనివారం మాఘమాస పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

తిరుపతిని రాజధానిగా చేయాలి: చింతా



నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

గూడూరు, ఫిబ్రవరి 17: తిరుపతిని రాజధానిగా చేయాలని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. శనివారం స్థానిక గాంధీబొమ్మ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం తుళ్లూరులో రాజధాని అని, ప్రస్తుతం విశాఖ రాజధాని అని ప్రభుత్వాలు ప్రకటించడం జరిగిందన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన తిరుపతిని రాజధానిగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, యువ నాయకురాలు డాక్టర్ నీనా, పూల చంద్రశేఖర్, వేమయ్య, భాస్కర్, బ్రహ్మయ, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టనంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట డాక్టర్ చింతా మోహన్ తిరుపతి రాజధాని కావాలంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గాడి వెంకటయ్య, నాగూర్, చిరంజీవి, తేజోవతి, తిలక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ పరిశ్రమల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

సత్యవేడు, ఫిబ్రవరి 17: శ్రీసిటీలోని పరిశ్రమల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించి రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద ఆయన కాంగ్రెస్ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. ఇక్కడ పరిశ్రమల్లో కార్మికులకు కనీసం రూ.23 వేలు వేతనం చెల్లించాలన్నారు. అనంతరం శ్రీసిటీ చైర్మన్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంట శ్రీనివాసరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తేజోవతి, నాయకులు నాగరాజు, పూల చంద్రశేఖర్, చందనపూడి రాజేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

చెకుముకి విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జేవీవీ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 17: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నారాయణ, వరప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, ప్రభాకర్, విజయ్‌బాబు, సుబ్బారావు, శ్రీనివాసాచారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

కోట, ఫిబ్రవరి 17: మహిళలు స్వశక్తితో ఎదిగి ఆదర్శంగా నిలవాలని ఏపీఎం రత్నయ్య అన్నారు. కోటలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో శనివారం వీవోఏలు, సీసీలు, సంఘ బంధం అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఏసీ చంద్రబాబు, ఏపీఎం రత్నయ్య మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా పొదుపు సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సీసీలు ప్రసాద్, శ్రీకాంత్, భాస్కర్, శంకరయ్య, కృష్ణమ్మ, బిందు, తదితరులు పాల్గొన్నారు.